ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి

9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -150 పేజీలు - 8 వెల ₹03/- ఆదివారం 6 సెప్టెంబర్ 2026

కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌వార్తల్లో నిజం లేదు

: పుకార్లను కొట్టిపారేసిన కేంద్రం

ఆరోపణలను ఖండించిన కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ

ఇప్పటికే టీఎఫ్ఎల్, ఎన్‌టీపీసీల నుంచి దరఖాస్తులు వచ్చాయని వెల్లడి

2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు గ్యాసిఫికేషన్ లక్ష్యం



ఢిల్లీ సెప్టెంబర్ 05, (రిపబ్లిక్ న్యూస్)

దేశంలో కోల్ గ్యాసిఫికేషన్ పథకానికి ఆదరణ కరవైందంటూ వస్తున్న కథనాలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. రూ. 37,500 కోట్ల ప్రోత్సాహకాలతో కూడిన ఈ పథకానికి ఒక్క దరఖాస్తు **మిగతా 2లో...**

ఢిల్లీ పోలీసులపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

జంతర్ మంతర్ వద్ద పోలీసుల లాఠీఛార్జ్ తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది:

విద్యార్థులు, నిరసనకారులపై బలప్రయోగాన్ని తప్పుపట్టిన సుప్రీంకోర్టు

నిరసన తెలిపే హక్కు రాజ్యాంగబద్ధమైనదని వ్యాఖ్య

బాధ్యులైన అధికారుల తీరుపై నివేదిక సమర్పించాలని ఆదేశం



ఢిల్లీ సెప్టెంబర్ 05, (రిపబ్లిక్ న్యూస్)

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, నిరసనకారులపై ఢిల్లీ పోలీసులు జరిపిన తీవ్ర లాఠీఛార్జ్, బలప్రయోగాన్ని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. **మిగతా 2లో...**



మిస్ వరల్డ్ 2026.. విజేతగా డొమినికన్ అమ్మాయి జోహెర్రీ మోలా డొమింగ్వెజ్

వియత్నాంలో జరిగిన 73వ ప్రపంచ సుందరి పోటీలు

భారత్ అందాలభామ నికితా పోర్వాల్‌కు టాప్ 20లో చోటు దక్కని వైనం

టాప్ 40లో స్థానం సంపాదించి సరిపెట్టుకున్న నికిత

మలేసియా, స్పెయిన్ సుందరీలకు రన్నరప్ స్థానాలు

ఢిల్లీ సెప్టెంబర్ 05, (రిపబ్లిక్ న్యూస్)

వియత్నాం వేదికగా అట్టహాసంగా జరిగిన 73వ మిస్ వరల్డ్ 2026 పోటీలు ముగిశాయి. ఈ ప్రతిష్ఠాత్మక కిరీటాన్ని డొమినికన్ రిపబ్లిక్‌కు చెందిన జోహెర్రీ మోలా డొమింగ్వెజ్ గెలుచుకుంది. స్పెయిన్‌కు

ఉద్యోగులకు వరాలజల్లు

12వ పీఆర్సీకి గ్రీన్ సిగ్నల్



ఉద్యోగ సంఘాలతో సీఎం చంద్రబాబు సమావేశం

పలు కీలక డిమాండ్లకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం

12వ పీఆర్సీ ఏర్పాటుకు, రెండు డీఏల విడుదలకు అంగీకారం

సరెండర్ లీవులు, అదనపు పెన్షన్ క్వాంటంపై కీలక నిర్ణయాలు

ప్రభుత్వంపై ఏటా రూ. 2880 కోట్ల అదనపు భారం

అమరావతి సెప్టెంబర్ 05, (రిపబ్లిక్ న్యూస్)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభవార్త అందించారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమని, వారికి అన్ని విధాలా అండగా నిలుస్తామని స్పష్టం చేసిన ఆయన, వారి దీర్ఘకాలిక డిమాండ్లపై సానుకూలంగా స్పందించారు. శనివారం వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశమైన సీఎం, **మిగతా 2లో...**

ఉత్తమ గురువులకు పురస్కారాలు

విజయవాడలో అట్టహాసంగా గురుపూజోత్సవం..

175 మంది ఉత్తమ గురువులకు చంద్రబాబు, లోకేశ్ సత్కారం



అమరావతి సెప్టెంబర్ 05, (రిపబ్లిక్ న్యూస్)

మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం గురుపూజోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించింది. విజయవాడలోని ఏ-కన్వెన్షన్ సెంటర్‌లో మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుక పండుగ **మిగతా 2లో...**

ఇక రాజకీయాల నుంచి తప్పుకుంటా..

వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను: అయ్యన్నపాత్రుడు

రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటున్నట్టు అయ్యన్న ప్రకటన

వయసు పైబడటం వల్ల విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నానని వెల్లడి

ఈ మూడేళ్ల కాలంలో తన నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తానన్న అయ్యన్న



అమరావతి సెప్టెంబర్ 05, (రిపబ్లిక్ న్యూస్)

ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సంచలన ప్రకటన చేశారు. తాను ఇకపై రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని స్పష్టం చేశారు. నర్సీపట్నంలో జరిగిన తన జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. **మిగతా 2లో...**

ఎస్సీ, ఎస్టీల రక్షణకు పటిష్ఠ వ్యవస్థ



ఎస్సీ, ఎస్టీల రక్షణ, సంక్షేమంపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

అట్రాసిటీ నిరోధక చట్టం అమలుపై నాలుగంచెల కార్యాచరణ ప్రణాళిక

ఈ ఏడాది నమోదైన 810 కేసులన్నీ పరిష్కరించామని వెల్లడి

2023 నుంచి బాధితులకు రూ. 15.43 కోట్ల పరిహారం అందజేత

రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిలో విజిలెన్స్ కమిటీల ఏర్పాటు

అమరావతి సెప్టెంబర్ 05, (రిపబ్లిక్ న్యూస్)

రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) రక్షణ, సంక్షేమం, అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం అమలును పటిష్ఠంగా పర్యవేక్షించేందుకు రూపొందించిన నాలుగంచెల కార్యాచరణ ప్రణాళికపై అధికారులు ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి వివరించారు. అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శనివారం ఈ సమావేశం జరిగింది.ఎస్సీ, ఎస్టీ వర్గాల రక్షణ, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ఈ కార్యాచరణను రూపొందించినట్లు **మిగతా 2లో...**

పవన్ కల్యాణ్ ఎఫెక్ట్..

ఆంధ్రా పేపర్ మిల్లుకు భారీ జరిమానా



రాజమండ్రి సెప్టెంబర్ 05, (రిపబ్లిక్ న్యూస్)

రాజమండ్రిలోని ఆంధ్రా పేపర్ లిమిటెడ్ పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) నిబంధనలను పదేపదే ఉల్లంఘిస్తూ, పవిత్ర గోదావరి నదిని కలుషితం **మిగతా 2లో...**

విద్యాశాఖలో అనేక మార్పులు తీసుకొస్తున్నాం



. టీచర్ల సమస్యలపై సీఎం రేవంత్ హామీ

పెండింగ్ టీచర్ల పదోన్నతులు పూర్తి చేశామన్న రేవంత్

బదిలీలపై జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామన్న సీఎం

రెండేళ్లలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ

సాంకేతిక విద్యకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్న రేవంత్

పాలిటెక్నిక్ విధానంలో మార్పులు లేవని స్పష్టీకరణ

హైదరాబాద్ సెప్టెంబర్ 05, (రిపబ్లిక్ న్యూస్)

విద్యాశాఖలో అనేక మార్పులు తీసుకొస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల**మిగతా 2లో...**

లాటరీ సీఎం ను కూల్చే రోజులు త్వరలోనే ఉన్నాయి

రేవంత్ ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ అన్న కేటీఆర్

420 మోసాలకు గాను రేవంత్ 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్

మంత్రులు కమీషన్ల కోసం కొట్టుకుంటున్నారని ఆరోపణ



ఇక రాజకీయాల నుంచి తప్పుకుంటా..

మొదటిపేజీ తరువాయి

వయసు పైబడటం వల్ల విశ్రాంతి తీసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపిన అయ్యన్న, అసెంబ్లీ స్పీకర్‌గా తనకు మిగిలి ఉన్న మూడేళ్ల పదవీకాలంలో నియోజకవర్గంలో పనులు, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడానికి ప్రాధాన్యమిస్తానని ప్రకటించారు. గత 31 ఏళ్లుగా తన పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామన్నారు.

మరోవైపు, రేపు (సెప్టెంబరు 6) నర్సీపట్నంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో 'బీసీ ఐక్య వేదిక సదస్సు' నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పించి విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇస్తుంటే, వైసీపీ మాత్రం బీసీల హక్కులపై రాజకీయం చేస్తూ కుట్రలు పన్నుతోందని టీడీపీ నేతలు మండిపడ్డారు. వైసీపీ కుట్రలను తిప్పికొట్టేందుకు బీసీ వర్గాలన్నీ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ఢిల్లీ పోలీసులపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి

జంతర్ మంతర్ ఘటనా స్థలంలో చోటుచేసుకున్న దారుణ పరిణామాలపై దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు రాజ్యాంగబద్ధమైనదని, ప్రశాంతంగా నిరసన వ్యక్తంచేసే వారిపై పోలీసులు క్రూరంగా వ్యవహరించడం ఎంతో విచారకరం, దిగ్భ్రాంతికరం అని వ్యాఖ్యానించింది.

ఈ క్రమంలోనే పోలీసుల దాడి, పెల్లెట్ గుండ్ల ప్రయోగం, మహిళా నిరసనకారులపై జరిగిన దౌర్జన్యాలపై సమగ్ర విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఐదుగురు సభ్యుల అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. శాంతియుత వాతావరణంలో విద్యార్థులు తమ సమస్యలపై నిరసన తెలుపుతుంటే పోలీసులు విచక్షణారహితంగా ప్రవర్తించడం ఎంతమాత్రం తగదని, ఈ ఘటనలో బాధ్యులైన అధికారుల తీరుపై నివేదిక సమర్పించాలని కమిటీని ఆదేశించింది. సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు, కమిటీ ఏర్పాటుతో ఢిల్లీ పోలీసు వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి నెలకొంది.

కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్ వార్తల్లో నిజం లేదు

మొదటిపేజీ తరువాయి

కూడా రాలేదన్న ప్రచారాన్ని కేంద్రం తోసిపుచ్చింది. ఈ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, ఇటువంటి అసత్య ప్రచారాలు ప్రాజెక్ట్‌పై ఎలాంటి ప్రభావం చూపలేవని కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.ఇప్పటికే ఈ పథకం కింద తాల్చేర్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (టీఎఫ్ఎల్), ఎన్‌టీపీసీ నుంచి దరఖాస్తులు అందినట్లు వెల్లడించింది. ఈ పథకానికి సంబంధించిన తొలి విడత దరఖాస్తుల గడువు సెప్టెంబర్ 7తో ముగియనుందని ఈ సందర్భంగా గుర్తుచేసింది. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా దాదాపు 25 ప్రాజెక్టులు ఏర్పాటవుతాయని, తద్వారా సుమారు రూ. 2.5 లక్షల కోట్ల నుంచి రూ. 3 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు వస్తాయని కేంద్రం అంచనా వేస్తోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 50 వేల మందికి పైగా ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.ఇంధన అవసరాల కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. దేశీయ బొగ్గు నిల్వలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గును గ్యాసిఫికేషన్ ప్రక్రియ ద్వారా వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం ఈ ఏడాది మే నెలలో ఈ ప్రతిష్ఠాత్మక పథకానికి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే.

ఎస్సీ, ఎస్టీల రక్షణకు పటిష్ఠ వ్యవస్థ..

మొదటిపేజీ తరువాయి

అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రస్థాయిలో ప్రత్యేకంగా 'ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ సెల్' ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీనితో పాటు రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిల్లో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసి, చట్టం అమలు తీరును నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు.

2026 సంవత్సరంలో ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద 810 కేసులు నమోదు కాగా, వాటన్నింటినీ పరిష్కరించినట్లు అధికారులు సమావేశంలో వెల్లడించారు. ఈ కేసుల విచారణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 14 ప్రత్యేక సెషన్స్ కోర్టులు, ఒక ప్రత్యేక కోర్టు పనిచేస్తున్నాయని తెలిపారు. 2023 నుంచి 2026 ఆగస్టు వరకు 1,478 కేసుల్లో బాధితులకు రూ. 15.43 కోట్ల పరిహారాన్ని అందించినట్లు వివరించారు.

ఈ ఉన్నతస్థాయి సమావేశంలో మంత్రులు డీబీవీ స్వామి, వి. అనిత, జి. సంధ్యారాణి, ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల ఎంపీలు కృష్ణప్రసాద్, దగ్గుమళ్ల ప్రసాద్, పలువురు ఎమ్మెల్యేలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజీత్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యనార్, న్యాయశాఖ అధికారులు హాజరయ్యారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల కోసం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల పర్యవేక్షణను మరింత బలోపేతం చేయడంపై కూడా సమావేశంలో చర్చించారు.

ఉత్తమ గురువులకు పురస్కారాలు

మొదటిపేజీ తరువాయి

వాతావరణంలో సాగింది. కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ముఖ్య అతిథులుగా హాజరై, రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన 175 మంది ఉత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులను ఘనంగా సత్కరించారు.

కార్యక్రమం ప్రారంభానికి ముందు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల అభిప్రాయాలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక వాల్ బోర్డులను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆసక్తిగా తిలకించి, పలు సూచనలు చేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ విద్యా విభాగాల్లో విశిష్ట సేవలు అందించిన 175 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా సత్కరించారు. పాఠశాల విద్య నుంచి 79 మంది, ఇంటర్మీడియట్ నుంచి 24, సాంకేతిక విద్య నుంచి 14, విశ్వవిద్యాలయాల నుంచి 35 మంది, కళాశాల విద్య నుంచి 17 మంది, ఇంజనీరింగ్, ఫార్మసీ విభాగాల నుంచి ఆరుగురికి ఈ పురస్కారాలు దక్కాయి. అవార్డు గ్రహీతలను శాలువాతో సత్కరించి, ప్రశంసాపత్రం, మెడల్, జ్ఞాపికతో పాటు రూ. 20 వేల నగదు బహుమతిని సీఎం, మంత్రి అందజేశారు.

వేడుకలో భాగంగా ఇద్దరు ఉపాధ్యాయులకు అరుదైన గౌరవం లభించింది. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన టీచర్ రమ్యసుధ, కడప జిల్లాకు చెందిన స్కిల్ హబ్ కోఆర్డినేటర్ కె. వెంకట్రావులను ముఖ్యమంత్రి చంద్రబాబు తన పక్కనే వేదికపై కూర్చోబెట్టి సమున్నతంగా గౌరవించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

మిస్ వరల్డ్ 2026.. విజేతగా డొమినికన్ అమ్మాయి జోహెర్రీ మోలా డొమింగ్వేజ్

మొదటిపేజీ తరువాయి



చెందిన ఎలిసబెత్ రెయిస్ మొదటి రన్నరప్‌గా, మలేసియాకు చెందిన తానూసియా చెట్టి రెండో రన్నరప్‌గా నిలిచారు. గత ఏడాది విజేత, థాయ్‌లాండ్‌కు చెందిన ఓపల్ సుచాతా చువాంగ్‌శ్రీ.. కొత్త ప్రపంచ సుందరికి కిరీటాన్ని అలంకరించింది.కొత్త ప్రపంచ సుందరి జోహెర్రీ వృత్తిరీత్యా ఉపాధ్యాయురాలు, సామాజిక కార్యకర్త. 'వాయిసెస్ ఆఫ్ టుమారో' అనే సంస్థ ద్వారా వెనుకబడిన వర్గాల పిల్లలకు ఇంగ్లీష్ విద్యను అందిస్తున్నారు. ఆమె కమ్యూనిటీ సేవ, విద్యారంగంలో చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ కిరీటం దక్కిందని పలువురు ప్రశంసిస్తున్నారు. వచ్చే ఏడాది ఈ పోటీలకు టాంజానియా ఆతిథ్యం ఇవ్వనుంది. ఇదిలా ఉండగా, ఈ ఏడాది చివర్లో ప్యూర్టోరికోలో జరిగే మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్ తరఫున కాజియా లిజ్ మేజో పాల్గొననున్నారు.ఈ పోటీల్లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించిన ఫెమినా మిస్ ఇండియా వరల్డ్ 2024 నికితా పోర్వాల్ టాప్ 40 వరకు చేరుకుంది. అయితే, ఆ తర్వాతి రౌండ్‌లో టాప్ 20లో ఆమెకు చోటు దక్కకపోవడంతో భారత అభిమానులకు నిరాశ ఎదురైంది. అయినప్పటికీ, వరుసగా ఐదోసారి మిస్ వరల్డ్ పోటీల్లో భారత్ స్థానం దక్కించుకునే పరంపరను నికితా కొనసాగించిందని, దేశానికి గర్వకారణంగా నిలిచారని మిస్ ఇండియా ఆర్గనైజేషన్ ఓ ప్రకటనలో అభినందించింది.

మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినికి చెందిన నికితా పోర్వాల్.. గతంలో టీవీ యాంకర్‌గా పనిచేశారు. నటిగా కూడా రాణిస్తున్న ఆమె, 'చంబల్ పార్' అనే బ్రిజ్ భాషా చిత్రంలో నటించారు. ఫైనల్‌లో ఆమె ధరించిన

లాటరీ సీఎం ను కూల్చే రోజులు త్వరలోనే ఉన్నాయి

రేవంత్ ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ అన్న కేటీఆర్

420 మోసాలకు గాను రేవంత్ 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్

మంత్రులు కమీషన్ల కోసం కొట్టుకుంటున్నారని ఆరోపణ

హైదరాబాద్ సెప్టెంబర్ 05, (రిపబ్లిక్ న్యూస్)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ యువతకు స్కిల్ లేదనడానికి రేవంత్ రెడ్డికి ఏ అర్హత ఉందని, ఆయన స్వయంగా ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన మోసాలపై బీఆర్ఎస్ నిర్వహించిన 'యువభేరి' సభలో పాల్గొన్న కేటీఆర్, కేవలం లక్కీ లాటరీ తగలడం వల్లే రేవంత్ సీఎం అయ్యారని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీనే గడగడలాడించిన తెలంగాణ యువశక్తికి రేవంత్ రెడ్డి ఓ లెక్కే కాదన్నారు. ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ పేరిట పెద్ద పెద్ద మాటలు చెప్పిన కాంగ్రెస్ నేతలు, అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు ఇవ్వడం మానేసి లూటీఫికేషన్‌లు నడుపుతున్నారని మండిపడ్డారు.ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలంటున్న కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా, లేక ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను వంచించిన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. ప్రజలకు చేసిన 420 రకాల మోసాలకు గానూ రేవంత్ రెడ్డి 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు రాబోతున్నాయని హెచ్చరించారు. మంత్రులు కమీషన్ల కోసం కొట్టుకుంటున్నారని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తమ ప్రభుత్వం 2.32 లక్షల ఉద్యోగాలు ఇస్తే, ఈ వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ ఇచ్చినవి కేవలం 16 వేల ఉద్యోగాలేనని చెప్పారు. ఉద్యోగాల కల్పనపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

ఉద్యోగులకు వరాల జల్లు

మొదటిపేజీ తరువాయి

పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నిర్ణయాల ద్వారా ప్రభుత్వంపై ఏటా రూ.2,880 కోట్ల అదనపు భారం పడనుందని సీఎం కార్యాలయం వెల్లడించింది. ఉద్యోగ సంఘాల నేతలతో జరిగిన చర్చల అనంతరం ప్రభుత్వం తీసుకున్న ముఖ్య నిర్ణయాలు ఇవే:

12వ పీఆర్సీ): ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) నియామకానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపారు.డీఏల చెల్లింపు: 2024 జూలై 1, 2025 జనవరి 1 తేదీలకు చెందిన రెండు కరువు భత్యం (డీఏ) బకాయిలను 2026 అక్టోబర్ 1 నుంచి చెల్లించాలని నిర్ణయించారు.సరెండర్ లీవులు: 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవుల మొత్తాన్ని వచ్చే సంక్రాంతి నాటికి ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడానికి అంగీకరించారు.పోలీసులకు అదనపు లీవ్: పోలీసు సిబ్బందికి ఒక అదనపు సరెండర్ లీవ్‌ను ఈ దసరా పండుగకు చెల్లించాలని నిర్ణయం తీసుకున్నారు.

అదనపు పెన్షన్: అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను 2027 జనవరి నుంచి అమలు చేయనున్నారు. దీని ప్రకారం, 70 ఏళ్ల దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్ల దాటిన వారికి 15 శాతం అదనపు పెన్షన్ లభిస్తుంది.

ఉద్యోగుల ఆరోగ్య పథకం (జూనూ): ఈహెచ్ఎస్‌ను మరింత పటిష్ఠం చేయాలని, వచ్చే నెల నుంచే ప్రతినెలా బిల్లుల చెల్లింపులను ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్‌కు ప్రభుత్వం నేరుగా చెల్లించాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో ఉద్యోగ సంఘాల నేతలు తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ఈ మేరకు తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రి కార్యాలయం సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది. దీంతో ప్రభుత్వ ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

గత పాలకుల నిర్వాకం వల్ల పెళ్లిళ్లను కూడా వాయిదా వేసుకున్నాం: ఏపీ ఉద్యోగులు

ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తామని ఉద్యోగుల హామీ

గత ప్రభుత్వ హయాంలో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డామని, కనీసం పీఎఫ్ లోన్లు కూడా మంజూరు చేయకుండా వేధించడంతో పిల్లల పెళ్లిళ్లు వాయిదా వేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ముఖ్యమంత్రి చంద్రబాబు తమ సమస్యల పరిష్కారంపై సానుకూలంగా స్పందించి, కీలక హామీలకు ఆమోదం తెలపడంతో వారిలో హర్షం వ్యక్తమవుతోంది.

శనివారం సీఎం క్యాంప్ కార్యాలయంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ సంఘాల నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ భేటీలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలపై చర్చించారు. సుదీర్ఘకాలంగా పెండింగులో ఉన్న 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) ఏర్పాటుకు సీఎం ఆమోదం తెలిపారు. దీంతో పాటు, బకాయిపడ్డ నాలుగు డీఏలలో రెండింటిని వెంటనే విడుదల చేసేందుకు అంగీకరించారు. మరికొన్ని ముఖ్యమైన పెండింగ్ అంశాల పరిష్కారానికి కూడా ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

ఈ నిర్ణయాలపై ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యల పట్ల ప్రభుత్వం చూపిన సానుకూలతకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం రిటైర్మెంట్ ఉద్యోగులకు మేలు చేసే అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను రద్దు చేసిందని, దానిని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించడంపై ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో (పీఎస్‌యూ) పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును పెంచే నిర్ణయాన్ని కూడా స్వాగతించారు.రాష్ట్రం ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తాము అర్థం చేసుకోగలమని ఉద్యోగ సంఘాల నేతలు అన్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్రాభివృద్ధికి, ప్రభుత్వానికి తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని వారు ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, ఆర్థిక శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏపీలో మున్సిపల్ పోరుకు కొత్త రూల్స్.. బ్యాలెట్ బదులు ఈవీఎంలు

అమరావతి సెప్టెంబర్ 05, (రిపబ్లిక్ న్యూస్)

ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న బ్యాలెట్ పత్రాల విధానానికి స్వస్తి పలికి, ఇకపై ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఈవీఎంలు) వాడాలని నిర్ణయించింది. ఓటర్లకు తొలిసారిగా 'నోటా' (నన్ ఆఫ్ ది ఎబౌవ్) ఆప్షన్‌ను కూడా అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం నూతన నిబంధనలతో కూడిన మూడు కీలక జీవోలను జారీ చేసింది.డిప్యూటీ మేయర్ ఎన్నికకు సంబంధించి ప్రభుత్వం కఠిన నిబంధనలను ప్రవేశపెట్టింది. మున్సిపల్ కార్పొరేషన్ తొలి సమావేశం జరిగిన 15 రోజుల్లోగా డిప్యూటీ మేయర్ ఎన్నిక పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఎన్నికకు ఒకరోజు ముందే పార్టీలు తమ కౌన్సిలర్లకు విప్ జారీ చేయాలి. విప్‌ను ధిక్కరించిన వారి సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేస్తారు. ఒకవేళ ఓట్లు సమానంగా వస్తే, లాటరీ ద్వారా విజేతను ప్రకటిస్తారు. ఏదైనా కారణంతో డిప్యూటీ మేయర్ పదవి ఖాళీ అయితే, ఆరు నెలల్లోగా ఉప



ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది.

తాజా నిబంధనల ప్రకారం, నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులకు డిపాజిట్ మొత్తాలను కూడా ఖరారు చేశారు. మేయర్, కార్పొరేటర్ స్థానాలకు పోటీ చేసే జనరల్ కేటగిరీ అభ్యర్థులు రూ.5,000, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.2,500 డిపాజిట్‌గా చెల్లించాలి. అభ్యర్థులు తమ ఆస్తులు, అప్పులు, విద్యార్హతలు, నేరచరిత్రకు సంబంధించిన వివరాలతో నోటరీ చేసిన అఫిడవిట్‌ను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. ఒక అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేయవచ్చు.

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ (సవరణ) చట్టం-2026 (యాక్ట్ నం. 22) ఆగస్టు 28 నుంచే అమల్లోకి వచ్చినట్లు ప్రభుత్వం జీవో నం. 210లో పేర్కొంది. పోలింగ్ కేంద్రాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకునేలా ప్రిసైడింగ్ అధికారికి అధికారాలు కల్పించారు.

ఇదే సమయంలో, కడప నగరపాలక సంస్థలో డివిజన్ల పునర్విభజన ప్రక్రియను కూడా ప్రభుత్వం ప్రారంభించింది. ప్రస్తుతం ఉన్న 50 డివిజన్లను 66కు పెంచుతూ డ్రాఫ్ట్ ప్రతిపాదనలు విడుదల చేసింది. సెప్టెంబర్ 11 వరకు దీనిపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించి, సెప్టెంబర్ 14న తుది నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఈ కొత్త నిబంధనలు, మార్గదర్శకాల ఆధారంగానే రాష్ట్రంలో రానున్న పురపాలక ఎన్నికల ప్రక్రియ జరగనుంది

విద్యాశాఖలో అనేక మార్పులు తీసుకొస్తున్నాం

మొదటిపేజీ తరువాయి

పదోన్నతులను పూర్తి చేశామని చెప్పారు. టీచర్ల బదిలీల విషయంలోనూ ప్రభుత్వం ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తోందన్నారు. కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు.

తల్లిదండ్రులతో సమానంగా పిల్లల భవిష్యత్తుకు పునాది వేసేది ఉపాధ్యాయులేనని రేవంత్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెండేళ్ల సమయం ఇస్తే సమస్యలను పరిష్కరించి చూపిస్తానన్నారు.

తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని సీఎం చెప్పారు. సాంకేతిక విద్యకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యావిధానంలో ఎలాంటి మార్పులు చేయడం లేదని స్పష్టం చేశారు.విద్యాశాఖ కమిషన్ ద్వారా అనేక సమస్యలను పరిష్కరిస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పీఆర్సీ సమస్యను పరిష్కరించామని చెప్పారు. ఇటీవల ఇందిరాపార్క్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేయడం తనకు చాలా బాధ కలిగించిందన్నారు.

కార్యక్రమానికి ముందు కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.

పవన్ కల్యాణ్ ఎఫెక్ట్.. ఆంధ్రా పేపర్ మిల్లుకు భారీ జరిమానా

మొదటిపేజీ తరువాయి

చేస్తున్నందుకు గాను ఏకంగా రూ. 21.01 కోట్ల భారీ పర్యావరణ జరిమానా విధించింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఇటీవలే మిల్లు యాజమాన్యంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన కొన్ని రోజులకే ఈ కఠిన చర్యలు తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో పవన్ కల్యాణ్ ఆంధ్రా పేపర్ మిల్లు వ్యవహారశైలిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమండ్రి నగరంలో వెలువడుతున్న మొత్తం కాలుష్యంలో దాదాపు సగం ఆంధ్రా పేపర్ మిల్లు నుంచే వస్తోందని ఆయన ఆరోపించారు. నగరం నుంచి రోజుకు 70 మిలియన్ లీటర్ల వ్యర్థ జలాలు ఉత్పత్తి అవుతుండగా, ఒక్క మిల్లు నుంచే 35 మిలియన్ లీటర్ల వ్యర్థాలు గోదావరి పరిసరాల్లోకి విడుదలవుతున్నాయని తెలిపారు. మిల్లు నుంచి విడుదలవుతున్న నీటి నమూనాలను పరీక్షించగా, బీఓడీ, ఫాస్ఫేట్లు, సల్ఫైడ్లు వంటి హానికారక రసాయనాలు నిర్దేశిత ప్రమాణాల కన్నా అత్యధికంగా ఉన్నట్లు తేలిందని వివరించారు. ఈ కాలుష్యం వల్ల గోదావరి నదిలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి జలచరాలకు ముప్పు వాటిల్లుతోందని, దుర్వాసనతో ప్రజారోగ్యం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు.కాలుష్యంతో పాటు పన్ను ఎగవేత అంశాన్ని కూడా పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. 2016 నుంచి సుమారు రూ. 21.34 కోట్ల బకాయిలు చెల్లించలేదని ఆయన తెలిపారు. పన్ను చెల్లింపుల నుంచి తప్పించుకునేందుకు మిల్లు యాజమాన్యం పదేపదే న్యాయస్థానాలను ఆశ్రయిస్తోందని విమర్శించారు.గడిచిన మూడు నెలలుగా పీసీబీ అధికారులు పలుమార్లు సమావేశాలు నిర్వహించినా యాజమాన్యం నుంచి స్పందన కరవైందని తెలిపారు. తక్షణమే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. 'స్వచ్ఛ గోదావరి – పవిత్ర పుష్కరాలు' లక్ష్య సాధనలో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని, పద్ధతి మార్చుకోకపోతే మిల్లు కార్యకలాపాలను నిలిపివేయడం, ఆస్తులు జప్తు చేయడం, లైసెన్సు రద్దు వంటి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం తొలి విడతగా భారీ జరిమానా విధించింది. ఇకపైనా యాజమాన్యం తీరు మారకపోతే మరింత కఠినమైన చర్యలు ఎదుర్కోక తప్పదని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

గంగమ్మ ఆలయ నిర్మాణానికి ప్రత్యేక పూజలు



పాక్యం ప్రతినిధి సెప్టెంబర్ 05, ప్రజారిపబ్లిక్ న్యూస్)
మండల కేంద్రం లోని కౌలూరు గ్రామంలో కానుకల వాగు సమీపంలో రజక శ్రీనివాసులు ఆధ్వర్యంలో గంగమ్మ ఆలయ నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తై, ఆలయం భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అర్చకుల ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, గంగమ్మ తల్లికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చనలు, ధూపదీప నైవేద్యాలు, మంగళహారతి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణం ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా సాగాలని, గ్రామ ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ఉమామహేశ్వరరెడ్డి, రజక సంఘాల నాయకులు నాగరాజు, తిమ్మయ్య భక్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణం పూర్తయిన అనంతరం భక్తులకు మరింత సౌకర్యవంతంగా పూజలు, ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ నిర్మాణానికి భక్తులు, దాతలు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ఆళ్లగడ్డ ఐ. సి. డి.యస్. సి. డి. పి. ఓ. తేజేశ్వరి



ఆళ్లగడ్డ సెప్టెంబర్ 5 రిపబ్లిక్ న్యూస్
ఆళ్లగడ్డ ఐ. సి. డి. ఎస్. ప్రాజెక్ట్ కార్యాలయం పరిధిలోని మండలాలలో అంగన్వాడీ ఆయాల నియామకానికి అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవలసినదిగా కోరుచున్నాము.
ఆయా పోస్టుల కాలీల వివరాలు. చిన్న బోధనము బి. సి –సి, చాకరాజువేముల గ్రామం. జనరల్ 4, అర్జునపురం బి. సి –ఈ, వీరారెడ్డి పల్లె ఓ. సి.(జు ఔా), గోవిందపల్లె ఓ. సి. 5 (జుఔా), వెలగలపల్లె ఎస్. సి.గ్రూప్ 2,దాసరపల్లి ఎస్. సి. గ్రూప్ 3,ముత్తలూరు –2.బి సి. ఏ –ముత్యాలపాడు –4–జెనరల్ –ఆళ్లగడ్డ –4=బి. సి. –డి –చింతలచెరువు –1,జెనరల్, చాగలమర్రి, 17–బి. సి. డి, దొర్నిపాడు, 4,బి. సి. బి, ఈ పైన కనపరచిన అంగన్వాడీ ఆయా పోస్టులకు కావలసిన అర్హతలు. 1.అభ్యర్థి తప్పనిసరిగా పదవ తరగతి పాస్ ఐ ఉండవలెను ఒక వేల పదవ తరగతి పాస్ ఐన వాళ్ళు ఎవరూ దరఖాస్తు చేసుకోకపోతే ఎక్కువ చదువు చదివి పాస్ ఐ ఉండవలెను. 2.అభ్యర్థినిలు తేదీ 01–07–2026 నాటికి 21 సంవత్సరాల వయసు నిండి 35సంవత్సరాల లోపు ఉండవలెను 3.అభ్యర్థినులు తప్పనిసరిగా వివాహితురాలై ఉండవలెను మరియు స్థానికంగా నివసితురాలై ఉండవలెను. 4.యస్. సి., యస్. టి.జనవాస ప్రాంతాలలోని అభ్యర్థులు 21 సంవత్సరాల వయసు నిండిన వారు లేనిచో దిగువ వయస్సు 18 సంవత్సరాలు నిండిన వారిని పరిగణలోకి తీసుకోబడును. ఇందుకు జత పరచవలసిన ధ్రువపత్రములు. 1.పుట్టినతేది /వయస్సు ధ్రువీకరణ పత్రం. ఫ్ 18–4–2025 ప్రకారం వారి యొక్క కులం ఏ గ్రూపునకు వర్తిస్తుందో తెలియజేస్తున్న ధ్రువీకరణ పత్రం ప్రస్తుతంది జతపరచవలయును. 3.విద్యర్హత ధ్రువీకరణ పత్రం యస్. యస్ సి. మర్క్ లిస్ట్, టి. సి. మరియు యస్. యస్. సి. లోపు ఎక్కువ తరగతి చదివిన మార్క్ లిస్ట్ మరియు టి. సి. జతపరచవలయును. 4.నివాస స్థల ధ్రువీకరణ పత్రం. 5.వితంతువు అయినచో భర్త మరణ ధ్రువీకరణ పత్రం మరియు 18సంవత్సరాల పిల్లలు వున్నచో వారి యొక్క వయసు ధ్రువీకరణ పత్రం. 6.వికలాంగులయినచో పి. హెచ్. సర్టిఫికెట్. 7.ఆధార్ కార్డు మరియు రేషన్ కార్డు దరఖాస్తు వెంట అవసరమగు ధ్రువపత్రములు జిరాక్స్ కాపీలను(సెల్ఫ్ అటెస్టేషన్ చేయవలెను)జతపరచి సంబంధిత సి. డి. పి. ఓ. కార్యాలయమునకు 05–09–2026వ తేదీ ఉదయం 10–30 గంటలనుండి 18–9–2026 సాయంత్రం 5 గంటలలోపు కార్యాలయం పని దినములలో సమర్పించవలెను.
గమనిక =ఈ నోటిఫికేషన్ ను ఏ సమయంలో ఐనా మార్పులు, ఖాలీల సంఖ్యలో మార్పు లేదా రద్దు చేయు అధికారం ఐ. సి. డి.యస్. ప్రాజెక్ట్ అధికారిని ఆళ్లగడ్డ వారికీ కలదు అని తెలియజేసారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు..
ఇంటింటా కుష్ఠు వ్యాధి గుర్తింపు.



నంద్యాల సెప్టెంబర్ 05, (రిపబ్లిక్ న్యూస్) జిల్లాలో కుష్ఠు వ్యాధి గుర్తింపు కార్యక్రమంపై వైద్యాధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నంద్యాల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మాతా శిశు భవనంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎం. శారదాబాయి పాల్గొని సర్వే వివరాలను వెల్లడించారు.
ఈ నెల 11 నుంచి 24వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 1,322 బృందాలను ఏర్పాటు చేశామని, ఒక్కో బృందంలో ఆశా కార్యకర్త, పురుష స్వచ్ఛంద కార్యకర్త ఉంటారని చెప్పారు. వైద్యాధికారి పర్యవేక్షణలో కుటుంబ సభ్యులందరినీ పరీక్షించి, అనుమానితులను సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలిస్తామని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి బహుళ ఔషధ చికిత్సను ఉచితంగా పూర్తికాలం అందిస్తామని పేర్కొన్నారు.
కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి చర్మవ్యాధి నిపుణులు హాజరై కుష్ఠు వ్యాధిపై శిక్షణ ఇచ్చారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు శ్రీనివాసులు, అంకిరెడ్డి, అనిల్‌కుమార్, కాంతారావు, తేజేశ్విని, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం చేసిన శ్రీ వివేకనంద విద్యా విహార్ హై స్కూల్ కరెస్పాండెంట్ ఆర్ ఎస్ ఆర్.గోపాల్

శ్రీ వివేకానంద విద్యా విహార్ హైస్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

పాములపాడు సెప్టెంబర్ 5 రిపబ్లిక్ న్యూస్:-
పాములపాడులోని, శ్రీ వివేకానంద విద్యా విహార్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ ఆర్.ఎస్.ఆర్. గోపాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రసంగిస్తూ డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విశేషాలను, దేశానికి ఆయన అందించిన సేవలను, విద్యారంగంలో ఆయన చేసిన కృషిని వివరించారు. విద్య విలువలు, గురువువిద్యార్థి సంబంధం, క్రమశిక్షణ, నైతిక విలువలు, విద్యార్థుల భవిష్యత్తులో ఉపాధ్యాయుల పాత్ర వంటి అంశాలపై ప్రసంగాలు నిర్వహించారు.
విద్యార్థులు తమ ఉపాధ్యాయుల పట్ల గౌరవం, కృతజ్ఞతను వ్యక్తం చేస్తూ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తిస్తూ వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు మరియు బహుమతులు అందజేశారు.



అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో కేక్ కటింగ్ నిర్వహించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమం ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉత్సాహంగా సాగింది.
ఈ సందర్భంగా శ్రీ వివేకానంద విద్యా విహార్ హై స్కూల్ కరస్పాండెంట్ ఆర్.ఎస్.ఆర్. గోపాల్ మాట్లాడుతూ ఒక మంచి సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులకు విద్యాబోధనతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ, బాధ్యత, దేశభక్తి వంటి లక్షణాలను పెంపొందించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.
ఉపాధ్యాయులే సమాజానికి మార్గదర్శకులు, విద్యార్థుల భవిష్యత్తుకు రూపశిల్పులు అని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందించి ఘనంగా సన్మానం చేయడం జరిగింది. విద్యార్థులు నైతిక విలువలు అనే స్కిట్ పై అద్భుతంగా అభినయించారు. శ్రీ వివేకానంద విద్యావిహార్ పాఠశాలలో 10 సంవత్సరాలకు పైగా పనిచేస్తున్న సురేంద్ర. బాలకృష్ణమ్మ షాజహాన్ జయ లక్ష్మమ్మ లకు ప్రత్యేక మెమెంటులు, ప్రశంస పత్రాలు బహుమతుల్ని అందజేసి ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ వివేకానంద విద్యా విహార్ పాఠశాల డైరెక్టర్ రాయపాటి దేవిక, అడ్మినిస్ట్రేటర్ బాలకృష్ణమ్మ, కల్చరల్ ఇన్ ఛార్జ్ షాజహాన్. ఉపాధ్యాయులు, సురేంద్ర, హబీబుల్లా, తిరుమలేష్, జయలక్ష్మి, ప్రవంతి, పుష్ప చంద్రకళ, మైత్రి, ప్రియ, గాయత్రీ, భారతి, మల్లిక, రాణి, కళిముల్ బి, శ్రీ లక్ష్మి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ఆళ్లగడ్డ సెప్టెంబర్ 5 రిపబ్లిక్ న్యూస్
ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆళ్లగడ్డ లోని ఎస్ ఆర్ కె ఇంగ్లీష్ మీడియం స్కూల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి ని ఘనంగా నిర్వహించారు.
గురుదేవోభవ స్ఫూర్తి దాత భారతదేశ మొదటి ఉపరాష్ట్రపతి రెండవ రాష్ట్రపతి భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని నేడు దేశ వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నసందర్భాన్ని పురస్కరించుకొని ఆళ్లగడ్డ టౌన్ లోని ఆర్టీసీ బస్టాండ్ కు దగ్గరలో ఎస్ ఆర్ కె ఇంగ్లీష్ మీడియం స్కూల్లో కరస్పాండెంట్ శేఖర్, ప్రిన్సిపాల్ నాగరాజు ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా అపుస్మా ఆళ్లగడ్డ నియోజకవర్గం యూనిట్ అధ్యక్షులు టి అమీర్ బాషా విచ్చేసి ఉపాధ్యాయ బృందం విద్యార్థి బృందంతో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల అర్పించి గురుదేవోభవ ఆచార్యదేవోభవ వందనం వందనం గురువుకు వందనం సర్వేపల్లి రాధాకృష్ణన్ కి జై భారత్ మాతాకీ జై అంటూ నినాదాలతో ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులకు ముఖ్య అతిథి అమీర్ భాష గౌరవంగా సన్మానించి



అభినందించారు విద్యార్థులు తమ గురువులకు పాద పూజ చేసి గురువులకు శిష్యులకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని గురుపూజోత్సవాన్ని జరుపుకొని స్ఫూర్తిగా నిలిచారు ఈ సందర్భంగా విద్యార్థులు చేశిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి ఈ సందర్భంగా అపుస్మా ఆళ్లగడ్డ నియోజకవర్గం యూనిట్ అధ్యక్షులు టి అమీర్ బాషా సందేశానిస్తూ ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన సర్వేపల్లి రాధాకృష్ణన్ రాష్ట్రపతి స్థాయికి ఎలా ఏదిగారో తెలిపారు. అయన జీవిత చరిత్ర ఉపాధ్యాయులకు మార్గదర్శకం వారు ఒక ఉపాధ్యాయుడిగా, దౌత్యవేతగా, రచయితగా, తత్వవేత్తగా, ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా దేశ విదేశాల్లో భారత జాతి గౌరవాన్ని ఇనుమడింపజేసిన మహోన్నత వ్యక్తి గురువులకే గురువు విద్యార్థి జీవితాన్ని



మలిచేవాడు గురువే అన్న పదానికి స్ఫూర్తి దాత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ.విద్యార్థి లోకానికి చిరస్మనుడిగా చిర యశస్సు అందుకున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవం గా జరుపుకుంటూ ఉపాధ్యాయులను విద్యాసంస్థలు ప్రభుత్వాలు ప్రశంసా పత్రాలతో ఉత్తమ ఉపాధ్యాయుడిగా గౌరవిస్తున్నారు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు వినయం సంస్కారం వంటి విద్యతో భావి పౌరులుగా చేసిదిద్దవలసిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడి మీద ఉంది.విద్యార్థులను భావి భారత పౌరుల్‌గా తయారు చేసే నిత్య శ్రామికులు నిరంతర జ్ఞాన స్ఫూర్తిదాతలు ఉపాధ్యాయులు.దేశ భవితకు వెన్నుముక నేటి ఉపాధ్యాయులు అంటూ కొనియాడారు.



శ్రీ మహానందీశ్వర స్వామి సన్నిధిలో

మహానంది, సెప్టెంబర్ 05, (రిపబ్లిక్ న్యూస్)
ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ చీఫ్ సెక్రటరీ, ఐఏఎస్ అనంత రామ్ కుటుంబ సభ్యులు శనివారం రాత్రి మహానంది ఆలయానికి వచ్చారు. స్వామివారి దర్శనానికి వచ్చిన వారికి ఆలయ సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి స్వాగతం పలికారు ఈ సందర్భంగా ఆయన శ్రీ కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం ఆలయ వేద పండితులు వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు.



ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారం అందుకున్న పిచ్చల మల్లేశ్వర్ రెడ్డి

ఆళ్లగడ్డ సెప్టెంబర్ 5 రిపబ్లిక్ న్యూస్
ఆళ్లగడ్డ లోని స్ర్కావీ ప్రభుత్వ జూనియర్ కళాశాల– ఆళ్లగడ్డ నందు తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న పిచ్చల మల్లేశ్వర రెడ్డి కి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారం లభించింది ఈ సందర్భంగా నంద్యాల జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.జనార్దన్ రెడ్డి,జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గనియా, మరియు న్యాయశాఖ, మైనారిటీ శాఖ మంత్రులు శ్రీయుత ఎన్ ఎం డి. ఫరూక్ ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి అభినందించడం జరిగినది.



వైభవంగా శ్రీ కృష్ణ జయంతి వేడుకలు





ఆళ్లగడ్డ సెప్టెంబర్ 5 రిపబ్లిక్ న్యూస్
ఆళ్లగడ్డ తాలూకా అహోబిలం గ్రామం లో ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలంలో శ్రీ కృష్ణ జయంతి ఉట్ల పండుగ సందర్భంగా సాయంత్రంశ్రీ ప్రహ్లాదవరద స్వామి వారిని,శ్రీ దేవి భూదేవి అమ్మవార్లను,నవనీత కృష్ణ స్వామి వారిని తిరుమాడ వీధులలో ఊరేగించారు.అనంతరం ఆలయంలో ఉట్టి కొట్టడమును వేడుకగా నిర్వహించారు.భక్తులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

మహానందిలో సినీ నటుడు శ్రీకాంత్ పూజలు





మహానంది, సెప్టెంబర్ 05, (రిపబ్లిక్ న్యూస్)
మహానంది పుణ్యక్షేత్రంలో సినీ నటుడు శ్రీకాంత్ శనివారం పూజలు నిర్వహించారు. నంద్యాల లోని తన మిత్రుడు ఆహ్వానం మేరకు వచ్చిన ఆయన శ్రీ కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామి వారి దర్శనానికి వచ్చారు. ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్ రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నటుడు శ్రీకాంత్ స్వామి, అమ్మవారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం తర్వాత ఆయనకు స్వామి, అమ్మ వారి తీర్థ ప్రసాదాలు అందించి వేద ఆశీర్వచనం చేశారు. క్షేత్రానికి వచ్చిన భక్తులు ఆయన చూసి ఫోటోలు దిగి అభిమానం చాటుకున్నారు.

జనసేన పార్టీ సమన్వయ కమిటీ సభ్యురాలిగా మైలేరి సురేఖ



ఆళ్లగడ్డ సెప్టెంబర్ 5 రిపబ్లిక్ న్యూస్ నంద్యాల పార్లమెంట్ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీ నియామకం జరిగింది. జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆళ్లగడ్డకు చెందిన మైలేరి సురేఖ ను సమన్వయ కమిటీ సభ్యురాలిగా నియమించారు. ఈ సందర్భంగా మైలేరి సురేఖ మాట్లాడుతూ పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన సత్తా చాటేలా కృషి చేస్తామన్నారు. ఈనెల 9వ తేదీన సమన్వయ కమిటీ లోని వారందరికీ మంగళగిరిలోని కేంద్ర కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఆమె తెలిపారు.

మట్టిలో మాణిక్యం

దైలా రామకృష్ణ



గురువుగా ఎదిగిన స్ఫూర్తిదాయక ప్రస్థానం -అక్షరమే ఆయుధంగా వేల జీవితాలకు వెలుగులు

రామకృష్ణది ఓ సాధారణ సన్నకారు రైతు కుటుంబం -ఉపాధ్యాయ వృత్తిలో అంచలంచలుగా ఎదిగిన వైనం





ప్రజా రిపబ్లిక్ ఉమ్మడి అనంతపురం

ఒక చిన్న గ్రామం అందులోనూ ఓ సాధారణ సన్నకారు రైతు కుటుంబం ఆర్థిక పరిస్థితులను అధిగమిస్తూనే... చదువుకోవాలనే తపనతో జీవితంలో ఉన్నతంగా ఎదగాలంటే విద్య ఒక్కటే మార్గమని బలంగా నమ్మిన ఓ బాలుడు, ఆ నమ్మకంతో ఒక్కో మెట్టు ఎక్కుతూ చివరకు వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసే గురువుగా ఎదిగిన స్ఫూర్తిదాయక ప్రస్థానం దైలా రామకృష్ణది. మిత్రులు, విద్యార్థులు ఆప్యాయంగా " రాకీ " అని పిలుచుకునే దైలా రామకృష్ణ జీవితం కేవలం ఒక ఉపాధ్యాయుడి ఉద్యోగ ప్రస్థానం కాదు, గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఓ సాధారణ వ్యక్తి విద్యను తన జీవిత ధ్యేయంగా మలుచుకుని సమాజానికి జ్ఞానాన్ని పంచిన సుదీర్ఘ విద్యాయాత్ర ఆయనది.

ఎదగాలనే పట్టుదల ఆయన జీవితానికి పునాది

శ్రీ సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలంలోని చందమూరు గ్రామం ఆయన జన్మస్థలం. దైలా పాపన్న, దైలా పోతక్క దంపతులకు 22 మార్చి 1977న జన్మించారు. తండ్రి సాధారణ సన్నకారు రైతు. వ్యవసాయంపై ఆధారపడి జీవించే కుటుంబంలో ఆరుగురు అన్నదమ్ములు, ఒక చెల్లెలుతో కలిపి ఏడుగురు సంతానంలో రామకృష్ణ మూడవవారు. పెద్ద కుటుంబం, ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ... ఆ గ్రామీణ జీవన పరిస్థితులు ఇవేవీ ఆయనలోని చదువుపై ఉన్న ఆసక్తిని అడ్డుకోలేకపోయాయి. చిన్ననాటి నుంచే కష్టాన్ని దగ్గరగా చూసిన ఆయనకు జీవితంలో ఎదగాలంటే పట్టుదలతో ముందుకు సాగాలనే విషయం అర్థమైంది. అదే పట్టుదల ఆయన జీవితానికి పునాదిగా మారింది. చందమూరు గ్రామంలోని పాఠశాలలో ఐదో తరగతి వరకు ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేసిన రామకృష్ణ ఉన్నత విద్య కోసం ధర్మవరం బాట పట్టారు. ధర్మవరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకున్నారు. అనంతరం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. అక్కడితో ఆయన విద్యాభ్యాసం ఆగలేదు. ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి, ఉపాధ్యాయ వృత్తిపై ఆసక్తితో తిరుపతిలో బి.ఎడ్ విద్యను అభ్యసించారు. చదువు పూర్తయిన తర్వాత తాను సంపాదించిన జ్ఞానాన్ని తనకే పరిమితం చేయకుండా ఇతరులకు పంచాలనే ఆలోచన ఆయనలో బలపడింది. ఆ ఆలోచనే ఆయనను 1998లో ఉపాధ్యాయ వృత్తిలోకి తీసుకువచ్చింది.

స్థానికంగానే ఉన్నత విద్యా అవకాశాలు కల్పించాలి

విద్యాపరంగా వెనుకబడిన ప్రాంతాల్లోని విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలని భావించిన రామకృష్ణ మిత్రులతో కలిసి కనగానపల్లి మండలంలో " అనంత జూనియర్ కళాశాల "ను ప్రారంభించారు. విద్యాసంస్థ అంటే కేవలం భవనం కాదని.. అక్కడి నుంచి ఎన్నో కుటుంబాల భవిష్యత్తులు నిర్మాణం కావాలని ఆయన నమ్మారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు స్థానికంగానే ఉన్నత విద్యా అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ ప్రయత్నం ఆయన విద్యా సేవలో మరో ముఖ్యమైన అధ్యాయంగా నిలిచింది. జీవితంలో ప్రతి ప్రయత్నం వెంటనే విజయాన్ని ఇవ్వదు.

విద్యార్థులు ఎదిగి నిలబడటం రామకృష్ణకు గొప్ప సంతృప్తి

ధర్మవరంలోని శ్రీ సరస్వతి విద్యామందిర్‌లో సైన్స్ టీచర్‌గా తొలి అడుగు వేశారు. అది కేవలం ఉద్యోగంలో చేరిన సందర్భం మాత్రమే కాదు, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే బాధ్యతను భుజాన వేసుకున్న కీలక ఘట్టం. తరగతి గదిలో పాఠాలు చెప్పడం మాత్రమే ఉపాధ్యాయుడి బాధ్యత కాదని, విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, దానికి సరైన దిశ చూపించడమే అసలు గురువు బాధ్యత అని భావించిన రామకృష్ణ ఆ దృక్పథంతోనే విద్యాబోధన కొనసాగించారు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే విద్యారంగంలో మరింత విస్తృతంగా సేవ చేయాలనే ఆలోచనతో మిత్రులు రిజ్వాన్, నజీర్, నరేంద్రలతో కలిసి ధర్మవరంలో " ఇండియా ఎడ్యుకేషనల్ సెంటర్ " ను ప్రారంభించారు. నాణ్యమైన కోచింగ్, సరైన మార్గదర్శకత్వం కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులకు ఈ కేంద్రం ఒక వేదికగా మారింది. అక్కడ చదువుకున్న వందలాది మంది విద్యార్థులు తరువాత ఉపాధ్యాయులు, ఇంజనీర్లు వంటి వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలకు ఎదిగారు. కొందరు దేశంలో స్థిరపడగా,మరికొందరు విదేశాల్లోనూ తమ ప్రతిభను చాటుకున్నారు.విద్యాబోధనలో అనుభవాన్ని మరింత విస్తరించుకునే క్రమంలో కళాశాల విద్యారంగంలోకి కూడా అడుగుపెట్టారు. బత్తలపల్లిలోని ఎస్ కే జీ ఎమ్ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా సేవలందించారు.



అనుభవాన్ని పాఠశాల విద్యార్థులకు అందించే అవకాశం

2006లో డీఎస్సీ అవకాశం రాకపోవడం ఆ వైఫల్యం ఆయన పట్టుదలను ఏమాత్రం తగ్గించలేదు. ఒక అవకాశం చేజారిందంటే ప్రయాణం ముగిసిపోయినట్లుకాదని భావించి మరింత పట్టుదలతో ప్రయత్నించారు. ఆ ప్రయత్నాలకు చివరకు ఫలితం దక్కింది. 2008లో ఒకేసారి ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ బయాలజీ పోస్టులకు ఎంపికయ్యారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుడిగా, కోచింగ్ సెంటర్‌లో మార్గదర్శకుడిగా, కళాశాలల్లో లెక్చరర్‌గా పొందిన అనుభవాన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించే అవకాశం ఆయనకు లభించింది.

జీవితాన్ని అర్థం చేసుకునే దిశగా మార్గదర్శకత్వం

కంబదూరు మండలంలోని కర్తనపర్తి ఎమ్ పి యూ పి పాఠశాలలో 2009 నుంచి 2017 వరకు హెడ్మాస్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విద్యార్థుల చదువు, క్రమశిక్షణ, పాఠశాల నిర్వహణ వంటి అంశాల్లో తనదైన ముద్ర వేశారు. అనంతరం 2017 నుంచి 2024 వరకు జెడ్ పి హెచ్ ఎస్ పాళ్గూరులో ఇంచార్జ్ హెడ్మాస్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఉపాధ్యాయుడిగా ఒక విద్యార్థికి పాఠం చెప్పడం ఒక బాధ్యత అయితే, ప్రధానోపాధ్యాయుడిగా మొత్తం పాఠశాల విద్యా ప్రగతిని ముందుకు నడిపించడం మరో పెద్ద బాధ్యత. ఈ రెండు బాధ్యతలను సమర్థంగా నిర్వహించిన రామకృష్ణకు పాఠశాల విద్యా వ్యవస్థపై విస్తృతమైన అనుభవం ఏర్పడింది. ప్రస్తుతం న్యామద్దల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా సేవలందిస్తున్నారు. తరగతి గదిలో పాఠ్యపుస్తకాల్లోని అంశాలను బోధించడం మాత్రమే కాకుండా, జీవితాన్ని అర్థం చేసుకునే దిశగా విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించాలనే భావన ఆయన బోధనలో కనిపిస్తుంది.



ఎదిగి నిలబడటాన్ని మించిన పురస్కారం మరొకటి లేదు

ముఖ్యంగా గ్రామీణ, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల నుంచి వచ్చే విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడం, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకునేలా ప్రోత్సహించడం తన బాధ్యతగా భావిస్తున్నారు. ఒక గురువుకు అవార్డులు, సన్మానాలు, ప్రశంసా పత్రాలు లభించడం ఆనందమే అయినా, తన వద్ద చదువుకున్న విద్యార్థి జీవితంలో ఎదిగి నిలబడటాన్ని మించిన పురస్కారం మరొకటి లేదు అందుకు ఆయన ప్రస్థానమే నిదర్శనం . గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఒక సాధారణ వ్యక్తి విద్యను ఆయుధంగా చేసుకుని సమాజంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న వ్యక్తి స్ఫూర్తిదాయక గాథ.

జ్ఞానం మాత్రం అతని జీవితంలో చిరస్థాయిగా ..

1998లో సైన్స్ టీచర్‌గా ప్రారంభమైన ఆయన విద్యా ప్రస్థానం నేటికీ కొనసాగుతోంది. సైన్స్ టీచర్‌గా, కెమిస్ట్రీ లెక్చరర్‌గా, కోచింగ్ సెంటర్ మార్గదర్శకుడిగా,విద్యాసంస్థ ప్రారంభకుడిగా, హెడ్మాస్టర్‌గా,ఇంచార్జ్ హెడ్మాస్టర్‌గా, ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్‌గా ఆయన ప్రయాణం అనేక మలుపులు తిరిగింది. చందమూరు పుట్టిన ఓ సాధారణ రైతు కుమారుడు, అదే గ్రామీణ నేల నుంచి అక్షరజ్ఞానాన్ని ఆయుధంగా చేసుకుని ముందుకు సాగాడు. ఒక సాధారణ రైతు కుటుంబంలో పుట్టి వందలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన గురువుగా నిలిచిన దైలా రామకృష్ణ (రాకీ) ప్రస్థానం నిజంగా ఒక స్ఫూర్తిదాయక విద్యాయాత్ర.

ఇంజక్షన్ వికటించి మహిళ మృతి

కేసి రామన్న ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం

ఓ నిండు ప్రాణం బలి

ఆసుపత్రి సిబ్బందిపై కుటుంబ సభ్యుల ఆగ్రహం

రికార్డులు తారుమారు చేశారంటూ ఆందోళన


అనంతపురం క్రైమ్, సెప్టెంబర్ 05,(రిపబ్లిక్ న్యూస్):

నగరంలోని కెసి రామన్న ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం వల్ల ఇంజక్షన్ వికటించి మహిళ మృతి చెందింది. చికిత్స పొందుతున్న సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నర్సు ఇంజక్షన్ ఇచ్చిందని, ఆ తర్వాత కొద్దిసేపటికే తమ తల్లి మృతి చెందిందని కుటుంబ సభ్యులు వాపోయారు. శుక్రవారం జ్వరం కారణంగా తాము చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చామని వైద్యుల లేకపోవడంతో సిబ్బంది నిర్లక్ష్యంతో ఇంజక్షన్ వేయడంతో అది వికటించి వల్ల తమ తల్లి మృతి చెందిందని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా వినిపిస్తున్నారు.

సమాచారం ఇవ్వకపోవడంపై వారు తీవ్ర ఆగ్రహం

అనంతపురం నగరంలోని రామ్‌నగర్‌లో ఉన్న కేసీ రామన్న ఆసుపత్రిలో శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటనపై శనివారం ఉదయం మృతురాలి కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు.కళ్యాణదుర్గం నియోజకవర్గం బ్రహ్మసముద్రం మండలం గుదిబండ గ్రామానికి చెందిన రామాంజనేయులు తల్లి గుండమ్మ (60) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చికిత్స నిమిత్తం ఆమెను అనంతపురంలోని కేసీ రామన్న ఆసుపత్రికి తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుండమ్మకు మధ్యాహ్నం సమయంలో వైద్యుల పర్యవేక్షణ లేకుండానే సిబ్బంది ఇంజక్షన్ ఇచ్చారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఇంజక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికే ఆమె పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తెలిపారు.అయితే తమ తల్లి






మృతి చెందిన విషయం గురించి ఆసుపత్రి సిబ్బంది తమకు సరైన సమాచారం ఇవ్వలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా మృతి అనంతరం ఆసుపత్రి రికార్డుల్లో మార్పులు చేశారనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. తమకు తెలియకుండా మృతదేహాన్ని ప్రభుత్వ అంబులెన్స్‌లో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారని వారు వాపోయారు. మృతదేహాన్ని తరలించే ముందు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకపోవడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ కేసీ రామన్న ఆసుపత్రిలో వైద్యులు కాకుండా ఆసుపత్రి సిబ్బంది ఇంజక్షన్ ఇవ్వడం, కొద్దినిమిషాల వ్యవధిలోనే తమతల్లి గుండమ్మ మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తోందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఇంజక్షన్ ఇచ్చిన సమయంలో రోగికి ఇచ్చిన ఇంజక్షన్ ఏంటో ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించాలని డిమాండ్ చేశారు.తల్లి మృతి చెందిన అనంతరం రోగికి సంబంధించిన వైద్య రికార్డులను తమకు చూపించకుండా, వివరాలను మార్చినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. చికిత్సకు సంబంధించిన పూర్తి వివరాలు, చికిత్స సమయంలో ఉన్న సిబ్బంది వివరాలను బయటపెట్టాలని వారు కోరుతున్నారు.

తమకు సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించడం కూడా పలు అనుమానాలకు కారణమవుతోందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో శనివారం ఉదయం గుండమ్మ కుటుంబ సభ్యులు, బంధువులు కేసీ రామన్న ఆసుపత్రి వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు.గుండమ్మ మృతిపై సమగ్ర విచారణ జరపాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. తమ తల్లి మృతి చెందిన ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరుతున్నారు.



" ఆంధ్రా అరుణాచలం " గా కుందుర్పి

ఎమ్మెల్యే అమిలినేని ఆధ్వర్యంలో మహా సంకల్పం -ఈ నెల 26న కుందుర్పి కొండ ఆధ్యాత్మిక కార్యక్రమం

అనంతపురం అనిల్ కుమార్ తో కలిసి పోస్టర్లు విడుదల చేసిన ఎమ్మెల్యే అనిలినేని





కళ్యాణదుర్గం ఆధ్యాత్మికం, సెప్టెంబర్ 05,(రిపబ్లిక్ న్యూస్): కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కుందుర్పి పవిత్ర కొండకు ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాధాన్యతను పెంచి " ఆంధ్రా అరుణాచలం "గా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర మహా సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. స్వయంభువుగా వెలసిన పవిత్ర కొండ చుట్టూ నిర్వహిస్తున్న గిరి ప్రదక్షిణలకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటికే వేలాది మంది భక్తుల భాగస్వామ్యంతో గిరి ప్రదక్షిణలు విజయవంతంగా పూర్తయ్యాయన్నారు. ఈ సందర్భంగా గిరి ప్రదక్షిణను కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమంగా కాకుండా పర్యావరణ పరిరక్షణతో అనుసంధానం చేస్తున్నారు. " ఒక భక్తుడు.. ఒక మొక్క.. ఒక బాధ్యత " అనే సంకల్పంతో ప్రతి భక్తుడు గిరి ప్రదక్షిణలో ఒక మొక్కను వెంట తీసుకెళ్లి, అనంతరం అనువైన ప్రదేశంలో నాటి సంరక్షించాలని నిర్వాహకులు పిలుపునిస్తున్నారు. మొక్క నాటడమే కాకుండా అది వృక్షంగా ఎదిగే వరకు నీరు పోసి కాపాడటమే నిజమైన పర్యావరణ సేవగా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. కుందుర్పి అభివృద్ధికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రతో పాటు అనంతపురం అనిల్‌కుమార్ కలిసి పనిచేయాలని నిర్ణయించారు. గిరి ప్రదక్షిణలు, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనతో పాటు కుందుర్పికి ఆధ్యాత్మికపర్యాటక గుర్తింపు తీసుకురావడంపై దృష్టి సారించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర, అనంతపురం అనిల్‌కుమార్ సంయుక్తంగా విడుదల చేశారు.కుందుర్పి పవిత్ర కొండ సమీపంలో సెప్టెంబర్ 26న ప్రత్యేక ఆధ్యాత్మిక,పర్యావరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గిరి ప్రదక్షిణ చేయడంతో పాటు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని నిర్వాహకులు కోరుతున్నారు. కుందుర్పి కొండ పరిసరాలను పచ్చదనంతో నింపుతూ భక్తి, ప్రకృతి పరిరక్షణ, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కార్యక్రమాలను కొనసాగించనున్నారు. సెప్టెంబర్ 26న జరిగే ప్రత్యేక కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని "ఆంధ్రా అరుణాచలం" నిర్మాణ సంకల్పానికి భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

ఉపాధ్యాయులకు సముచిత గౌరవం

విద్యా రంగానికి కొత్త ఊపిరి
ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం
“ విలువల విద్య “ పుస్తకావిష్కరణ





అనంతపురం ప్రతినిధి, సెప్టెంబరు 05.(రిపబ్లిక్ న్యూస్):
సమాజానికి దిశానిర్దేశం చేసే ఉపాధ్యాయులకు సముచిత గౌరవం దక్కేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం అనంతపురంలోని ప్రభుత్వ డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల డ్రామా హాల్‌లో గురుపూజోత్సవం, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భారతరత్న, భారత రెండో రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అధ్యక్షత వహించగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎస్టీ కమిషన్ సభ్యుడు పి.వెంకటప్ప, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ ప్రాంతీయ ఛైర్మన్ పూల నాగరాజు, విద్యాశాఖ ఆర్జేడీ శామ్యూల్, డీఈవో అయూబ్ హుస్సేన్, సమగ్రశిక్ష ఏపీసీ శైలజతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు, అధికారులు హాజరయ్యారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన 67 మంది ఉపాధ్యాయులను ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎమ్మెల్సీ తదితరులు ఘనంగా సత్కరించి పురస్కారాలు అందజేశారు.

ఉపాధ్యాయుల స్థానం మరింత పెంచుతున్నాం

ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ గతంలో ఉపాధ్యాయులకు తగిన గౌరవం లభించలేదని, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు తిరిగి సముచిత గౌరవం, గుర్తింపు లభిస్తోందన్నారు. ఉపాధ్యాయులు కేవలం పాఠాలు బోధించే వ్యక్తులు మాత్రమే కాదని, సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పులని పేర్కొన్నారు. తల్లిదండ్రుల తర్వాత అత్యంత గౌరవం పొందేది గురువేనన్నారు. ఐఏఎస్ అధికారులు, విద్యార్థులు, న్యాయమూర్తులు, రాజకీయ నాయకులు ఇలా ప్రతి రంగంలో ఉన్నత స్థానాల్లో ఉన్న వారందరూ ఏదో ఒక దశలో ఉపాధ్యాయుల వద్ద విద్యను అభ్యసించిన వారేనని గుర్తుచేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా పాఠశాలల్లో మెగా పేరెంట్‌టీచర్ సమావేశాలు నిర్వహిస్తూ తల్లిదండ్రులు, విద్యార్థుల, ఉపాధ్యాయుల మధ్య సమన్వయాన్ని పెంచుతున్నామని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా 148 రోజుల్లో 16,347 పోస్టులను భర్తీ చేయడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు పైతం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేలా చర్యలు చేపట్టడంతో పాటు సన్నబియ్యంతో భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల కృషి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రోత్సాహంతో జిల్లాలో గత ఏడాది సుమారు 4 వేల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు మారడం గర్వకారణమన్నారు.

దేశ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకం

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ “మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ “ అనే భావన భారతీయ సంస్కృతిలో గురువుకు ఉన్న విశిష్ట స్థానాన్ని తెలియజేస్తుందన్నారు. దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్రను ఏ కొలమానంతోనూ అంచనా వేయలేమన్నారు. చరిత్రలో రాజులు, పాలకులు, ప్రముఖులు సైతం గురువుల వద్ద విద్యాభ్యాసం చేసి సమాజానికి నాయకత్వం వహించారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కేవలం భవనాలుగా కాకుండా జ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నైతిక విలువలను పెంపొందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం జరిగిందని, మరో మూడు డీఎస్సీల నిర్వహణపై ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. టెట్ పరీక్షకు సంబంధించి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పార్లమెంటులో ప్రస్తావించినట్లు తెలిపారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉచిత యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, పౌష్టికాహారం వంటి





సదుపాయాలతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించడం ద్వారా విద్యా వ్యవస్థలో సానుకూల మార్పులు వస్తున్నాయని చెప్పారు.

9095 శాతం ఫలితాలే లక్ష్యం: జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

గత ఏడాది ఉపాధ్యాయుల సమష్టి కృషితో పదో తరగతి ఫలితాల్లో సుమారు 10 శాతం మెరుగుదల సాధించామని తెలిపారు. వచ్చే ఏడాది పదో తరగతి ఫలితాలను 90 నుంచి 95 శాతానికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలిసి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేశారని తెలిపారు. జిల్లాలో సుమారు 30 వేల నుంచి 35 వేల మంది పిల్లల ఇళ్లను ఉపాధ్యాయులు సందర్శించారని, ఫలితంగా దాదాపు 4 వేల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని వివరించారు. ప్రజల నమ్మకాన్ని మరింత పెంచేలా ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో మరో 10 వేల మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల వైపు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. పదో తరగతి ఫలితాలను మెరుగుపరచడంతో పాటు పాఠశాలల్లో ఉన్న చిన్నచిన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

గురువుల సేవలకు గుర్తింపు

ఎస్టీ కమిషన్ సభ్యుడు పి.వెంకటప్ప మాట్లాడుతూ అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలకు విద్యా రంగంలో విశిష్ట చరిత్ర ఉందన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఈ కళాశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేయడం జిల్లాకు గర్వకారణమన్నారు. కళాశాలలో చదివిన ఎంతోమంది విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, మేధావులుగా ఎదిగారని తెలిపారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రుల తర్వాత దేవుడితో సమానమని పేర్కొన్నారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, డీఎస్సీ ద్వారా వేలాది పోస్టులను భర్తీ చేయడం అందులో భాగమేనన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు జరుగుతున్నాయని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

విద్యార్థులకు మార్గదర్శకులు ఉపాధ్యాయులే

ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్య సమాజ అభివృద్ధికి పునాది అని, ఉపాధ్యాయులు కేవలం బోధకులు కాకుండా సామాజిక సంస్కర్తలుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఆర్ట్స్ కళాశాలకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌తో ఉన్న అనుబంధం జిల్లాకు ప్రత్యేక గుర్తింపునిస్తోందన్నారు. విద్యార్థులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా ఉపాధ్యాయులు కూడా తమ బోధనా పద్ధతులను ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ విద్యా విధానాల్లో వస్తున్న మార్పులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని కోరారు.

విలువలతో కూడిన విద్య అవసరం

ఏపీఎస్ఆర్టీసీ ప్రాంతీయ ఛైర్మన్ పూల నాగరాజు మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గురువుకు దైవంతో సమానమైన స్థానం ఉందన్నారు. విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు విలువలతో కూడిన విద్య అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యారంగంలో ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడతాయని తెలిపారు.

పారదర్శకంగా ఉపాధ్యాయుల బదిలీలు

కార్మిక, సంక్షేమ మండలి ఛైర్మన్ వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఉపాధ్యాయులకు గౌరవం, గుర్తింపు కల్పించడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ, గురుకుల, నివాస పాఠశాలల్లో విద్యార్థుల ఫలితాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు.

వేడుకలా విద్యా సంవత్సరం
-విద్యాశాఖ ఆర్జేడీ డి.ఆర్. శామ్యూల్

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యా సంవత్సరం మొత్తం పండుగ వాతావరణంలో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రధాన లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. అనంతరం ప్రముఖ వక్త చాగంటి కోటేశ్వరరావు రచించిన “ విలువల విద్య “ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 67 మందిని ఘనంగా సత్కరించి పురస్కారాలు అందజేశారు.

సమగ్ర అభివృద్ధితో కర్నూలు నగరానికి కొత్త రూపు

రూ.88.06 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి పనులు
రూ.2.04 కోట్ల పనులకు మంత్రి టీ.జీ. భరత్ శంకుస్థాపన
నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలి





కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 5)
కర్నూలు నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీ.జీ. భరత్ తెలిపారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, ఉద్యానవనాలు, వీధి దీపాలు తదితర సౌకర్యాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో పనులు చేపడుతున్నామని చెప్పారు.
నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి మంత్రి రూ.2.04 కోట్ల నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌క్యాప్) నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కంట్రోల్ రూం నుంచి ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ సర్కిల్ వరకు, సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల నుంచి రెండు వాగుల వరకు సెంట్రల్ మీడియన్ డివైడర్ల నిర్మాణానికి రూ.1.66 కోట్లతో పనులు చేపట్టనున్నారు.
అలాగే మార్కెట్ యార్డు వెనుక బస్టాండ్ నుంచి ఎస్ఏపీ క్యాంపు మార్గంలో రూ.38 లక్షల వ్యయంతో సీసీ రహదారి నిర్మాణానికి కూడా మంత్రి శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం, ఎన్‌క్యాప్ తదితర పథకాల ద్వారా నగరంలో మొత్తం రూ.88.06 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
కొండారెడ్డి బురుజు నుంచి కోట్ల విజయభాస్కరరెడ్డి కూడలి, కిడ్స్ వరల్డ్, రాజ్ విహార్ మీదుగా వై.జంక్షన్ వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రూ.2.23 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు రీ-సర్ఫేసింగ్ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

రోడ్డు భద్రతకు ప్రాధాన్యం

నగరంలోని 14 కూడళ్లు, ప్రధాన రహదారుల వెంట అవసరమైన ప్రాంతాల్లో రూ.30 లక్షల నగరపాలక సంస్థ సాధారణ నిధులతో రోడ్ మార్కింగ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. సెంటర్ లైన్లు, ఎడ్జ్ లైన్లు, లేన్ లైన్లు, జీబ్రా క్రాసింగ్స్, రంబుల్ స్ట్రిప్స్ వంటి సూచికలను ఏర్పాటు చేయడం ద్వారా వాహనదారులు, పాదచారులకు స్పష్టమైన మార్గదర్శకత్వం కల్పిస్తున్నామని చెప్పారు.

కూడళ్ల సుందరీకరణకు ప్రత్యేక ప్రణాళిక

నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనతో పాటు నగర సుందరీకరణ, పచ్చదనం పెంపునకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. తొమ్మిది ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.
కూడళ్లలో టర్ఫ్ గడ్డి ఏర్పాటు చేయడంతో పాటు ఇప్పటికే ఉన్న వాటర్ ఫౌంటెన్లను అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ప్రధాన రహదారుల వెంట ఉన్న డివైడర్లకు ఆకర్షణీయమైన రంగులు వేయడం, అవసరమైన చోట్ల మరమ్మతులు చేయడం, నడకబాటలను అభివృద్ధి చేయడం వంటి పనులను చేపడుతున్నామని వివరించారు.
నగరంలో పచ్చదనాన్ని పెంచేందుకు మొక్కలు నాటడంతో పాటు ఇప్పటికే ఉన్న మొక్కలను సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగర ప్రధాన ప్రవేశ మార్గాల్లోని కూడళ్లను ప్రత్యేకంగా తీర్చిదిద్దేందుకు డిజైన్లు రూపొందిస్తున్నామని, గోడలపై ఆహ్లాదకరమైన చిత్రాలు, పచ్చదనం, ఆకర్షణీయమైన ల్యాండ్‌స్కేపింగ్‌తో కర్నూలు నగరానికి సరికొత్త రూపాన్ని తీసుకురావడమే లక్ష్యమని కమిషనర్ పేర్కొన్నారు.
కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, ఎంఈ మనోహర్ రెడ్డి, గిరిరాజ్, ఏఈ ఖాసిం, శానిటరీ ఇన్స్పెక్టర్లు మునిస్వామి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాల నియంత్రణే కర్నూలు పోలీసుల లక్ష్యం

8 నెలల్లో 28,531 ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదు..
నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్న ఎస్పీ విక్రాంత్ పాటిల్





కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 5)
రహదారి ప్రమాదాలను నియంత్రించడంతో పాటు ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా కర్నూలు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ప్రతి జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.2026 జనవరి 1 నుంచి ఆగస్టు 31 వరకు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జిల్లా పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. ఈ ఎనిమిది నెలల కాలంలో మొత్తం 28,531 ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదు చేశారు.నమోదైన కేసుల్లో ఓవర్ స్పీడ్‌కు సంబంధించి 5,839, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపినందుకు 4,094, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినందుకు 1,463, డ్రంకెన్ డ్రైవింగ్‌కు 5,972, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినందుకు 10,670, మైనర్లు వాహనాలు నడిపినందుకు 79, ట్రిపుల్ డ్రైవింగ్‌కు 414 కేసులు నమోదయ్యాయి.
రహదారి ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు.వాహనం నడిపే సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం, అతివేగంగా ప్రయాణించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి వాహనదారుడు, ప్రయాణికుడు బాధ్యతగా వ్యవహరించినప్పుడే ప్రమాదాలను గణనీయంగా తగ్గించగలమని పేర్కొన్నారు.ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని పోలీసులు తెలిపారు. నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలని జిల్లా పోలీసు శాఖ ప్రజలను కోరింది.

వైకుంఠం మల్లికార్జున వాక్యాలపై వాల్మీకి నాయకులు ఆగ్రహం

బోయల మనోభావాలను దెబ్బతీసే వాక్యాలు వెనక్కి తీసుకోవాలి -తక్షణమే క్షమాపణలు చెప్పకపోతే తీవ్ర పరిణామాలు తప్పవు



దేవనకొండ సెప్టెంబర్ 5 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-
బోయ, వాల్మీకి కులస్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేత వైకుంఠం మల్లికార్జున పై దేవనకొండ మండల వాల్మీకి నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమన్ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో బోయ కులస్తులను ఉద్దేశించి ఎవరి వద్ద డబ్బులు ఉంటే వారి వెంట ఉండి వారు చెప్పిన పనులు చేస్తూ, వారు పెట్టిన తిండి తింటున్నారు అన్న విధంగా మాట్లాడటం తీవ్ర అసభ్యంతకరమని నాయకులు మండిపడ్డారు. బోయలు వాల్మీకులు శతాబ్దాలుగా ఆత్మగౌరవంతో జీవిస్తున్నారని సహజంలో సమాజంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు గౌరవం కలిగిన వర్గం అని నాయకులు పేర్కొన్నారు. రాజకీయం విమర్శలు చేయడానికి ఎవరికీ హక్కు ఉన్న, ఒక సామాజిక వర్గాన్ని కించపరిచేలా వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడే హక్కు ఎవరికీ లేదన్నారు. వైకుంఠం మల్లికార్జున చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని బోయ వాల్మీకి సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాము ఎవరికి రాజకీయ ప్రలోభాలకు లొంగేవారు కాదని, డబ్బులకు అమ్ముడుపోయే సమాజం కాదని స్పష్టం చేశారు. బోయల గురించి మాట్లాడే ముందు తమ చరిత్ర ఆత్మగౌరవం సమాజం చేసిన పనులను తెలుసుకోవాలని ఇతవు పలికారు. తక్షణమే వాక్యలపై క్షమాపణ చెప్పకపోతే వాల్మీకి నాయకులు బోయ కులస్తులతో కలిసి ప్రజాస్వామ్యం పద్ధతిలో ఆందోళన చేపడుతామని నాయకులు హెచ్చరించారు. అవసరమైతే పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాజకీయంగా ఎవరిని విమర్శించిన తమకు అభ్యంతరం లేదని కానీ మొత్తం బోయ సమాజాన్ని కించపరిచేలో వ్యాఖ్యలు చేయడాన్ని మాత్రం తీవ్రంగా ఖండిస్తున్నామని వారు స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి వాక్యాలను పునరావృతం కాకుండా వైకుంఠ మల్లికార్జున జాగ్రత్త వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి మండల నాయకులు కప్పట్రాల మల్లికార్జున, అలారుదిన్నె రామారావు నాయుడు, వెలమకూరు భాస్కర్, పొట్లపాడు అశోక్, కరివేముల వీరేష్, చిన్నరాముడు, నాగేష్ మండల పరిధిలోని వివిధ గ్రామాల వాల్మీకి సోదరులు పాల్గొన్నారు

కప్పట్రాల్లా గ్రామ సభలో సమస్యలపై చర్చ

సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం: వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ





దేవనకొండ సెప్టెంబర్ 5 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):- దేవనకొండ మండలంలోని కప్పట్రాల్లా గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాల్లా బొజ్జమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గ్రామస్థులతో ఆమె మాట్లాడి గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిదశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, కప్పట్రాల్లా గ్రామంలో కూడా అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని బొజ్జమ్మ తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తామని పేర్కొన్నారు.గ్రామ సభ ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడంజరుగుతుందని ఆమె తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని బొజ్జమ్మ కోరారు.

వైభవంగా శ్రీ రామకృష్ణ విద్యాలయం పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం

అలంకరించిన గురు వందన రథం పై ఉపాధ్యాయులను కూర్చోబెట్టి,రథానికి తాళ్లు కట్టి లాక్కుంటూ వెళ్లిన పూర్వ విద్యార్థులు

. 1956లో ప్రారంభించబడిన శ్రీ రామకృష్ణ విద్యాలయం 70 వసంతాల పండుగ

. ఉపాధ్యాయ దినోత్సవం రోజు గురువులను అంగరంగ వైభవంగా సత్కరించిన పూర్వ విద్యార్థులు.

. రాష్ట్రం, దేశం నలుమూలల నుండి హాజరైన వందలాది మంది పూర్వ విద్యార్థులు

. పాఠశాల పూర్వ వైభవానికి సహకరిస్తామన్న పూర్వ విద్యార్థులు





నంద్యాల సెప్టెంబర్ 5 (రిపబ్లిక్ న్యూస్) :

స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గా సేవలందించిన నివర్తి వెంకటసుబ్బయ్య స్థాపించిన పాఠశాల శ్రీ రామకృష్ణ విద్యాలయం 70 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా శనివారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం పట్టణంలో వైభవంగా నిర్వహించారు.

పద్మావతి నగర్ ఇండోర్ స్టేడియం దగ్గర నుండి పూలతో అలంకరించిన గురు వందన రథం పై ఉపాధ్యాయులను కూర్చోబెట్టి రథానికి తాళ్లు కట్టి భారీగా హాజరైన పూర్వ విద్యార్థులు లాగుతూ ఊరేగింపుగా, మేళ తాళాలతో సంజీవ్ నగర్ లో ఉన్న పాఠశాల వద్దకు చేరుకున్నారు. దారి పొడవునా గురువందన రథం పై పూల వర్షం కురిపించారు. ఉపాధ్యాయులకు పాఠశాల వద్ద పూర్ణకుంభ స్వాగతం పలికి సాదరంగా ఆహ్వానించారు.

పాఠశాలలో తాము చదువుకున్న సమయంలో నిర్వహించిన విధానంలో ప్రార్థన నిర్వహించారు. మా తెలుగు తల్లికి మల్లెపూదండ సామూహికంగా ఆలాపించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్,పాఠశాల వ్యవస్థాపకులు నివర్తి వెంకటసుబ్బయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

1974 లో ప్రారంభమైన పదవ తరగతి బ్యాచ్ తో కలిసి దాదాపు 50 బ్యాచ్ లకు చెందిన 600 మంది పైగా హాజరైన విద్యార్థులు తాము ఉన్నత స్థాయికి చేరుకోవడానికి దోహదం చేసిన గురువులను, తమ సహాధ్యాయులను సుదీర్ఘకాలం తర్వాత కలవడం తో ఆ ప్రాంగణమంతా ఉద్వేగ భరిత వాతావరణం కనిపించింది. తమ పాఠశాల జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ పాఠశాల గదుల్లో ఉల్లాసంగా తిరిగారు. గురువులకు పాదాభివందనం చేసి విద్యార్థులు ఆశీస్సులు అందుకున్నారు. తాము విద్యాబుద్ధులు నేర్పిన విద్యార్థులు నేడు ఉన్నత స్థాయికి చేరుకోవడం చూసి ఉపాధ్యాయులు ఆనందభరితులయ్యారు.

తదుపరి ప్రథమ(ప్రమద నంది) కళ్యాణ మండపంలో పూర్వ విద్యార్థులైన డాక్టర్ రవికృష్ణ, ఫ్యాక్టరీస్ అధికారి శివకుమార్ రెడ్డి, రవి ప్రకాష్, శ్రీధర్, ప్రమద నంది దేవస్థానం చైర్మన్ చలం బాబు, విజయ భాస్కర్, జర్నలిస్ట్ మధు, వరదా మురళి, మహబూబ్ బాషా తదితర నిర్వాహక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఒక్కో గురువును ఒక బ్యాచ్ విద్యార్థుల బృందం శాలువా, పూలమాల, తలపాగా, నూతన వస్త్రాలు, జ్ఞాపిక, కొబ్బరికాయతో తాంబూలం,ట్రావెల్ బ్యాగ్ బహుమతులను అందించి అంగరంగ వైభవంగా సత్కరించారు. సన్మాన స్వీకరించిన గురువులతో ప్రతి బ్యాచ్ గ్రూప్ ఫోటోలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నివర్తి మోహన్ మాట్లాడుతూ తమ తండ్రి నివర్తి వెంకటసుబ్బయ్య నంద్యాలలో సంజీవ్ నగర్ శ్రీనివాస్ నగర్ ఏర్పాటుకు నాంది పలికారని, సంజీవనగర్ ఏర్పడిన తర్వాత అక్కడ పిల్లలకు పాఠశాల అవసరం ఉండడంతో 1956లో ఈ పాఠశాలను స్థాపించారని తెలిపారు. తదుపరి వివిధ సందర్భాలలో నిర్మించిన భవనాలను అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, అప్పటి ప్రధానమంత్రి నరసింహారావు వంటి ప్రముఖులు ప్రారంభించారని తెలిపారు. ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలగా 1974లో 10వ తరగతి బ్యాచ్ మొదలుపెట్టి దాదాపు నాలుగు దశాబ్దాల పాటు పట్టణంలో ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలగా నిలిచిందని అన్నారు. ఒక సమయంలో దాదాపు 200 మంది విద్యార్థులు పాఠశాలలో ఉండే వారిని తెలిపారు. పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. అయితే ఎయిడెడ్ ఉపాధ్యాయ పోస్టులు లేకపోవడం, అనేక ప్రైవేట్ పాఠశాలలు రావడంతో ప్రస్తుతం తక్కువ సంఖ్యతో పాఠశాల నడుపుతున్నామని, భవనాలకు కూడా మరమ్మతుల అవసరం ఉందని అన్నారు.

డాక్టర్ రవి కృష్ణ, శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల, ఉపాధ్యాయులు విద్యార్థులు అందరినీ ఉన్నత విలువలతో తీర్చిదిద్దారని, వివిధ రంగాలలో ఈ పాఠశాల విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకున్న వారు రాష్ట్రంలో, దేశంలో, ప్రపంచంలో నలుమూలలా ఉన్నారని తెలిపారు. వీరందరి సహకారంతో పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు అందరి తరపున ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో విశ్రాంత పాఠశాల ఉపాధ్యాయులు శ్రీరాములు, ఆంజనేయులు, శ్రీరంగం, సుబ్బరాయుడు, మల్లికార్జున, నరసింహారావు,రామ సుబ్బారెడ్డి,చంద్రశేఖర్, రామ్మూర్తి, శేషఫణి శర్మ, గంగాధర శాస్త్రి, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు తిరుమల రావు, ఉపాధ్యాయులు సునీతమ్మ, పుల్లయ్య గంగాధర రెడ్డి పాల్గొని పూర్వ విద్యార్థుల ఆత్మీయ సత్కారం స్వీకరించారు

కర్నూలు జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా ఆవుల సోమన్న

ఎస్సీ మోర్చా బలోపేతం.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా

నూతన బాధ్యతపై బీజేపీ శ్రేణుల్లో హర్షం



దేవనకొండ సెప్టెంబర్ 5(ప్రజా రిపబ్లిక్ న్యూస్):-

భారతీయ జనతా పార్టీ కర్నూలు జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా ఆవుల సోమన్న నియమితులయ్యారు. బీజేపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణ పరమహంస ఈ నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు.

పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తున్న ఆవుల సోమన్నకు జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించడంపై బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లా స్థాయి బాధ్యతలకు ఎదిగిన సోమన్నకు పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ జిల్లావ్యాప్తంగా ఎస్సీ మోర్చాను మరింత బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని ఆవుల సోమన్న తెలిపారు. ఎస్సీ వర్గాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు విస్తృతంగా చేరేలా కృషి చేస్తానని, యువతను పార్టీ కార్యక్రమాలకు అనుసంధానం చేసి క్షేత్రస్థాయిలో బీజేపీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.ఆవుల సోమన్నకు నూతన బాధ్యతలు లభించడంపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన డాక్టర్. శంకర్ శర్మ





కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 5 (రిపబ్లిక్ న్యూస్) సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని డాక్టర్. శంకర్ శర్మ అన్నారు. ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్టీబీసీ కళాశాలలో ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ శంకర్ శర్మ పాల్గొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి ముఖ్య అతిథులు డాక్టర్. శంకర్ శర్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ విద్యా సంస్థలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను డాక్టర్. శంకర్ శర్మ సన్మానించారు. ఈసందర్భంగా డాక్టర్. శంకర్ శర్మ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ గొప్పతనాన్ని వివరించారు. ఉపాధ్యాయుల ద్వారానే సమాజంనిర్మించబడుతుందన్నారు. ప్రస్తుతం డిజిటల్ టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందిన ఉపాధ్యాయుల ప్రాధన్యత మాత్రం,వెలకట్టలేనిదన్నారుప్రకృతిని మానవజాతి దెబ్బతినే విధంగా చేస్తున్నారన్నారు. సెల్ ఫోన్ వాడకం ఎక్కువ అయ్యిందని సెల్ ఫోన్ లో ఏది ఉపయోగమో దాన్ని మాత్రమే చూడలాని డాక్టర్. శంకర్ శర్మ సూచించారు.ఈకార్యక్రమంలో ఎస్టీబీసీ కళాశాల కరస్పాండెంట్ ఆర్ఆర్డీ సజీవరాజు, రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్ బాష, ఒలింపిక్ అసోసియేషన్ నాయకులు నాగరత్నమయ్య, ప్రిన్సిపాల్ సునీత రోజ్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జాబితాలపై గ్రామసభ:-ఎంపీడీఓ జ్యోతి

దేవనకొండ, సెప్టెంబర్ 5(ప్రజా రిపబ్లిక్ న్యూస్): -

దేవనకొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ జ్యోతి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ ఓటర్ల జాబితాలను గ్రామస్తుల సమక్షంలో పరిశీలించారు.జాబితాల్లో పేర్లు, వివరాలను ప్రజలు క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. పేర్లు లేదా వివరాల్లో తప్పులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, అర్హులైన వారి పేర్లు జాబితాలో లేకపోతే తెలియజేయాలని కోరారు. అభ్యంతరాలు, సవరణలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు.పంచాయతీ కార్యదర్శి శంకరమ్మ ప్రజలకు పలు సూచనలు చేశారు. ఓటర్ల జాబితాల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు. గ్రామసభలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గురువులే విద్యార్థుల భవిష్యత్తుకు బాటసారులు!

దేవనకొండ జడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా గురుపూజోత్సవం

పూలమాలలు, శాలువాలతో ఉపాధ్యాయులకు ఘన సన్మానం

గురువుల సేవలను కొనియాడిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఉత్సాహంగా పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు





దేవనకొండ, సెప్టెంబర్ 5(ప్రజా రిపబ్లిక్ న్యూస్):-

దేవనకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీచర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోపనిచేస్తున్న ఉపాధ్యాయులు,ఉపాధ్యాయినీలను పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు.విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర ఎంతో గొప్పదని పలువురు ఉపాధ్యాయులు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. విద్యాబోధనతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, సంస్కారం, నైతిక విలువలను పెంపొందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు టీచర్స్ డే ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రసంగించారు. గురువుల పట్ల గౌరవం, కృతజ్ఞతాభావం కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు కూడా తమ గురువుల సేవలను కొనియాడుతూ ప్రసంగాలు చేసి, టీచర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల విద్యా ప్రగతికి ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేస్తున్నారని ప్రధానోపాధ్యాయులు నజీర్ అహ్మద్ తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నజీర్ అహ్మద్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులను సన్మానించడం ద్వారా గురువుల సేవలకు గౌరవం చాటినట్లు అయిందని పలువురు పేర్కొన్నారు.చివరగా టీచర్స్ డే వేడుకలను విజయవంతం చేసిన ఉపాధ్యాయులు,ఉపాధ్యాయినీలు, విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు నజీర్ అహ్మద్ అభినందనలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం -గ్రామాల్లో బిజెపి బలోపేతం

:-మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్ -స్థానిక సంస్థల ఎన్నికలకు బిజెపి ఇప్పటి నుంచే సన్నద్ధం

యువతను బిజెపిలోకి ఆహ్వానించి, పార్టీని మరింత బలోపేతం చేస్తాం



పాములపాడు సెప్టెంబర్-5 రిపబ్లిక్ న్యూస్:- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామాల్లో బిజెపి బలోపేతం చేస్తామని మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అభిరుచి మధు సూచనల మేరకు శనివారం మండల కేంద్రంలోని, బిజెపి కార్యాలయంలో మండల పదాధికారుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు రాయపాటి మురళీమోహన్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసి, బిజెపి జెండాను రెపరెపలాడేలా కృషి చేస్తామని తెలిపారు. కేంద్ర సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి స్థానంలో బిజెపి అభ్యర్థి పోటీ చేసేలా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలని నాయకులకు సూచించారు. ముఖ్యంగా పార్టీపై ఆసక్తి ఉన్న యువతను బిజెపి లోకి తీసుకురావాలని, స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. బిజెపి కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. మండల పదాధికారులు ప్రజలతో నిరంతరం మమేకమై, గ్రామాల్లోని ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పార్టీ నాయకుల ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, ప్రతి గ్రామంలో బిజెపికి బలమైన కార్యకర్తల బృందాన్ని ఏర్పాటు చేయాలని నాయకులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో మండల పదాధికారులు ప్రవీణ్ కుమార్, గోపాలకృష్ణయ్య, రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, మంగలి వెంకటేశ్వర్లు, ఇమ్రాన్ భాష, ఎస్.కె.ఖాజా వలి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు ఉపాధ్యాయులే కీలకం

గూడూరు మండలంలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు





గూడూరు సెప్టెంబర్ 5 (రిపబ్లిక్ న్యూస్)

గూడూరు మండలంలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలన ప్రధాన అంశంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాన ఉపాధ్యాయులు సయ్యద్ నశీర్ హుస్సేన్ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడంలో తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని తెలిపారు. బాల్య వివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై కలిగే ప్రతికూల ప్రభావాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.అలాగే బాల్య వివాహాలకు సంబంధించిన ఘటనలు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలను వినియోగించుకోవాలని విద్యార్థినులకు సూచించారు. ఏరియా కోఆర్డినేటర్ మునిస్వామి మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన కోసం పనిచేస్తున్న Just Rights for Children కోనేరు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానం చేసిఅభినందించారు. బాల్య వివాహాల నిర్మూలనకు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక దినోత్సవం ప్రకటించడంపై కార్యక్రమంలో పాల్గొన్న వారు హర్షం వ్యక్తం చేశారు.ఉపాధ్యాయులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మౌనిక ఏరియా కోఆర్డినేటర్ ఎన్ రామాంజనేయులు మునుస్వామి సవారయ్య వన్నూరు వల్లి, సురేంద్ర వీరన్నలు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భావి తరాల నిర్మాణంలో ఉపాధ్యాయులే శిల్పులు

విద్యార్థుల బలాలు, బలహీనతలను గుర్తించి మార్గనిర్దేశం చేయాలి: కలెక్టర్ డా. ఏ. సిరి

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 5)

భావి తరాల నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకుని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యాశాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల కార్యక్రమంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, తాను కూడా ఎంఎస్సీ పూర్తి చేసిన అనంతరం కాంట్రాక్ట్ లెక్చరర్‌గా ఉపాధ్యాయ వృత్తితోనే తన ప్రస్థానాన్ని ప్రారంభించానని తెలిపారు. విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తూ వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల సేవలు అమోఘమని కొనియాడారు.

విద్యార్థులు ఇంటికంటే ఎక్కువ సమయం పాఠశాలలో గడుపుతున్నందున విద్యాభివృద్ధితో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే మహత్తర బాధ్యత గురువులపై ఉందన్నారు.

ప్రస్తుత సాంకేతిక యుగంలో విద్యాబోధనలోనూ మార్పులు అవసరమని ఎంపీ పేర్కొన్నారు. కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.



జ్ఞానంతో పాటు మానవీయ విలువలు నేర్పాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి మాట్లాడుతూ విద్యార్థులకు జ్ఞానాన్ని అందించడం గొప్పదైన, పుణ్యప్రదమైన బాధ్యత అని అన్నారు. సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.

పాఠ్యాంశాల బోధనతో పాటు విద్యార్థుల ప్రవర్తన, ఆలోచనా విధానం, వ్యక్తిత్వ వికాసంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థులలోని బలాలు, బలహీనతలను గుర్తించి, అవసరమైన సమయంలో తగిన మార్గనిర్దేశం చేయాలని అన్నారు. విద్యార్థుల భావోద్వేగ, మానసిక అవసరాలను కూడా ఉపాధ్యాయులు గుర్తించాలని కలెక్టర్ సూచించారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహం, సానుకూల మార్గనిర్దేశం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి దోహదపడుతుందని తెలిపారు.

తన విద్యాభ్యాసంలో మార్గనిర్దేశం చేసిన గురువులందరికీ కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి వ్యక్తి జీవితంలో తొలి గురువు తల్లేనని పేర్కొంటూ, తన తల్లితో పాటు విద్యాబుద్ధులు నేర్పిన గురువులందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

భావి భారత పౌరులను తీర్చిదిద్దే శిల్పులు

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు భావి భారత పౌరులను తీర్చిదిద్దే శిల్పులని అన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు మానవీయ విలువలు, నైతికత, క్రమశిక్షణను బోధించాలని సూచించారు. విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. డీఎస్సీ ద్వారా అధిక సంఖ్యలో ఉపాధ్యాయులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు.







48 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు

గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి పురస్కారాలు అందజేశారు. పాఠశాల విద్యాశాఖకు చెందిన 36 మంది, ఇంటర్మీడియట్ విద్యాశాఖకు చెందిన 12 మంది కలిపి మొత్తం 48 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి పురస్కారాలు అందించారు.

ఈ కార్యక్రమంలో డీఈవో జి. సుధాకర్, సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ లోకరాజు, ఇంటర్మీడియట్ ఆర్ఐఓ లాలెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల ఉజ్వల భవిష్యత్తు ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

బండి ఆత్మకూరు, సెప్టెంబర్ 5,(రిపబ్లిక్ న్యూస్):- ఆడపిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అహర్నిశలు పాటుపడుతున్నారని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానిక కస్తూరిబా పాఠశాలలో రూ 1.63 కోట్లతో నిర్మించిన బాలికల వసతి గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కస్తూర్బా పాఠశాలలో ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకున్నారు. ఇందులో భాగంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఆయన బాలికలను ఉద్దేశించి ప్రసంగించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను చదివిస్తున్నారన్నారు. వారి కష్టాన్ని ఏమాత్రం వమ్ము చేయకుండా బాలికలు వారి జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. అందుకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం కూడా ఆడపిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఇంట్లో ఉన్న పిల్లలు ప్రతి ఒక్కరు చదువుకోవాలని ఉద్దేశంతో తల్లికి వందనం పథకం ద్వారా బాల బాలికలకు రూ 13 వేల చొప్పున తల్లి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. వీటితోపాటు పాఠశాలల అభివృద్ధి, వసతి గృహాల అభివృద్ధి వంటి కార్యక్రమాలను విద్యాశాఖ మంత్రి ప్రతిష్టాత్మకంగా చేపట్టారని ఆయన వివరించారు. ఆడపిల్లలు చదువుతోపాటు ఆరోగ్యం పై దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రస్తుతం ఎంతోమంది బాలికలు మండల టాపర్ లుగా నిలుస్తున్నారని భవిష్యత్తులో జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో టాపర్లుగా రాణించే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం చిన్నారులతో కలిసి ఆయన ఫోటోలు దిగి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఇన్చార్జి ముమ్మడి నాగ కృష్ణారెడ్డి, శ్రీశైలం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు బొల్లవరం మల్లేశ్వర రెడ్డి, బైరెడ్డి సుబ్బారెడ్డి, మైనార్టీ నాయకులు జాకీర్ ఖాన్, అంజాద్ ఖాన్, ఇస్మాయిల్, మహమ్మద్, నందయ్య, వివిధ గ్రామాల టిడిపి నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.







గుట్టపాడు గ్రామం ఎస్సీ కాలనీలో త్రాగునీరు రావడం లేదు

దాదాపుగా రెండు నెలలుగా త్రాగునీటి సమస్య తీవ్రం

ఓర్వకల్ ప్రతినిధి, సెప్టెంబర్ 5 (రిపబ్లిక్ న్యూస్)

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం గుట్టపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణ పనుల సమయంలో మంచినీటి పైప్‌లైన్లు దెబ్బతినడంతో దాదాపు రెండు నెలలుగా తాగునీటి సరఫరా నిలిచిపోయిందని స్థానిక మహిళలు తెలిపారు.



ట్యాంకర్ల ద్వారా కూడా నీరు అందకపోవడంతో కిలోమీటర్ల దూరం వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే పైప్‌లైన్లను మరమ్మతు చేసి కాలనీలో తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్థులు ప్రభుత్వాన్నిఅధికారులను నాయకులను కోరుతున్నారు. తాగునీటి సమస్యపై వెంటనే పరిష్కరించాలని గుట్టపాడు గ్రామ ఎస్సీ కాలనీ వాసులు కోరుకుంటున్నారు

చిన్నపాటి ఘర్షణ.. యువకుడి ప్రాణం బలి.

పాణ్యం ప్రతినిధి సెప్టెంబర్ 05 (ప్రజారిపబ్లిక్ న్యూస్)

మండల కేంద్రంలోని బోయపేట చెరువుకట్ట సమీపంలో ఇద్దరి మధ్య చోటుచేసుకున్న చిన్నపాటి ఘర్షణ తీవ్ర విషాదానికి దారితీసింది.ఈ ఘటనలో గోరుకంటి బాలు 19 తీవ్రంగా గాయపడి మృతి చెందగా,మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అయితే ఘర్షణకు



అసలు కారణాలు ఏమిటి ఘటనలో ఎంతమంది పాల్గొన్నారు, అనే విషయాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి రావాల్సి ఉంది.ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.యువకుడి మృతితో కుటుంబ సభ్యులు, బంధువుల్లో విషాదం నెలకొంది.

కుల మత వర్గ బేధాలు లేకుండా అందరిని ఆదరించిన జింపెక్స్ సంస్థ అధినేత ఆర్ఎస్ గోయంక.

పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరరావు.

రైల్వే కోడూరు సెప్టెంబర్ 5 రిపబ్లిక్ న్యూస్.

అతి చిన్న వయసులోనే కలకత్తా నుండి చెన్నై కేంద్రంగా చేసుకొని ఆంధ్రాలోని అప్పటి కడప జిల్లా ఇప్పటి తిరుపతి జిల్లా లోని ఓబులవారిపల్లె మండలం మంగంపేట లో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ముగ్గు రాయి లో వ్యాపారం స్థాపించి అతిరథ మహారథుల మధ్య చాకచక్యంతో ముగ్గురాయి వ్యాపారంలో ఐదు దశాబ్దాలుగా కుల మతాలకు వర్గ భేదాలకు రాజకీయాలకు అతీతంగా అందరిని ఆదరించి పేరుగాంచిన జింపెక్ సంస్థ మరియు ఫౌండర్ ఆర్ఎస్ గోయంక అని ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు ఆయన సంస్మరణ సభలో కొనియాడారు రాజు కన్వెన్షన్ సభలో

శనివారం జరిగిన ఆర్ఎస్ గోయింకా సంస్మరణ కార్యక్రమం విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగినది,వారి కుటుంబ సభ్యుల అధ్యక్షతన ఈ కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగంపేట బెరైటీస్ వ్యాపారానికి గోయింకా 1973లో పిన్నవయసులోనే రావడం జరిగిందన్నారు. అప్పటి కడప జిల్లాకు చెందిన వైఎస్ రాజారెడ్డి, సీఎం రామనాథరెడ్డి శనివారపు శంకర్ రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్తలు మంగంపేటలో వ్యాపార రీత్యా ముగ్గురాయి ఉత్పత్తిని చేయడం జరుగుతుండేది. అసమయంలో 18 వ ఏటనే వచ్చిన జింపెక్స్ అధినేత , వ్యాపార రీత్యా అత్యంత అనుభవం కలిగిన ఆ ముగ్గురిలో చిన్న పిల్లాడిగా గోయింకా వారి చెంతన చేరి ఎలాంటి ఒడిదుడుకులకు చోటు ఇవ్వకుండా

వ్యాపార మెలకువలు తెలుసుకొని గొప్ప వ్యాపారవేత్తగా, పేరుపొంది వారితోపాటు వ్యాపారాన్ని లాభనష్టాలు పంచుకుంటూఈ రంగంలో వ్యాపారాన్నికొనసాగించారు. వారి అడుగుజాడల్లో నడుస్తూ కొంత కాలానికి వ్యాపారం పట్ల, ముగ్గురాయి ఉత్పత్తి పట్ల వ్యాపార దురంధరులైన రాజారెడ్డి,రామ్నాథ్ రెడ్డి, శంకర్ రెడ్డి లకు శిష్యుడిగా మెలిగిన





గోయింకానే వారికి సలహాలు ఇచ్చే స్థాయికి ఎదిగారు. మంగంపేట ముగ్గురాయిని ప్రపంచ స్థాయిలో భారతదేశానికి ఘనత తెచ్చిన ప్రముఖ పారిశ్రామిక వేత్త జింపెక్స్ సంస్థ అధినేత ఆర్ఎస్ గొయంకే నని తెలిపారు. కొనుగోలుకు సోచుకోని సిఎండి ముగ్గురాయిని అప్పట్లోనే ఓడలు, షిప్పులు ద్వారా రవాణా చేసి భారతదేశం యొక్క ఖ్యాతిని ప్రపంచ స్థాయిలో నిలబెట్టిన ఘనత జింపెక్స్ సంస్థదే అన్నారు. ఎందరో వ్యాపారవేత్తలు మంగంపేటకు వచ్చి కోట్లలో ముగ్గురాయి వ్యాపారంలో ఆదాయాన్ని గడించి స్వలాభాలు చూసుకుని వెళ్లిపోయారే తప్ప ఏ సంస్థ పదికాలాలపాటు నిలిచి ఇక్కడ ఉన్న ప్రజలను చిన్నచిన్న వ్యాపారులను పేదలను , కుల మత వర్గ బేధాలు లేకుండా ఆదరించిన సంస్థ ఏదన్నా ఉంది అంటే నాటి నుంచి నేటి వరకు ఐదు దశాబ్దాలకు పైన అందరి మన్ననలు పొంది నేటికీ కొనసాగుతున్న సంస్థ జింపెక్స్‌నని అన్నారు,ఆర్ ఎస్ గోయింకా భౌతికంగా మనతో లేకపోయినా ఆయన ఆత్మ కోడూరు ప్రాంతాలలోనే ఉంటుందని,ఈయన చేసిన సేవలు గొప్పవని మరుపురానివని తెలిపారు. సందలూరు సాయిబాబా గుడికి కోటి రూపాయల పైన ఖర్చు చేసి వెండి సింహాసనాన్ని 44 కేజీలతో చేయించి, గుడి గోపురం పైన అత్యంత ఖర్చుతో కూడిన విలువైన కలశాన్ని కూడా ఆయన తన ద్వారా పెట్టించడం మా తల్లిదండ్రులు చేసుకున్న పుణ్యమేనని, నేను నేడు ఈ స్థాయిలో ఉన్నాను అంటే ఒక విధంగా వ్యాపార రీత్యా గురువుగాను మరో విధంగా నాకు తండ్రిగాను నన్ను ఏమి తెలియని వయసు నుంచి ఆదరించి అక్కున చేర్చుకుని ఈ స్థాయికి తెచ్చిన ఘనత ఆర్ఎస్ గోయింకాదేనని విశ్వేశ్వరరావు కంటతడి పెట్టుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్ రాయుడు మాట్లాడుతూ ఎంతోమంది మంగంపేటలో వ్యాపారాలు చేసి సక్రమంగాను, అక్రమంగాను సంపాదించుకుని వెళ్లిపోయారే గాని ప్రజలకు ఉపయోగపడిన సందర్భాలు తక్కువనే చెప్పవచ్చు.నేడు ఈ కోడూరు నియోజకవర్గానికే కాకుండా కడప తిరుపతి రాజంపేట, చిత్తూరు జిల్లాలకు కూడా ఆయన ఎన్నో బడులు గుడులు బస్ షెల్టర్లు మౌలిక సదుపాయాలు కల్పించి గొప్ప పేరు తెచ్చుకున్న వ్యాపారవేత్త జింపెక్స్ అధినేత గోయింకానేనని కీర్తించారు, వ్యాపార రీత్యా ఈయన ద్వారా తాను ఎన్నో తెలుసుకుని ముగ్గురాయి వ్యాపారానికి దిగడం కూడా జరిగిందని తెలిపారు.అనంతరం రైల్వే కోడూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మాజీ ఇన్చార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు మాట్లాడుతూ ఆయనతో ఉన్న సత్సంబంధాలు తనకు చాలా తక్కువని అయినప్పటికీ ఆయన చేసిన సేవా కార్యక్రమాలు కోడూరు



శివాలయానికి గోపురాలు నిర్మించడం, దక్షిణామూర్తి ఆలయాన్ని కట్టించడం, కోడూరు ప్రాంతంలో మొట్టమొదటిగా బస్సు షెల్టర్ నిర్మించడం అనేకమంది పేదలకు సహాయ సహకారాలు అందించడం,ఎంతోమంది వ్యాపారులకు అండగా నిలిచి ఆర్థిక సాయం చేసి వారిని అభివృద్ధి చేసిన మానవతావాది అన్నారు . అనంతరం రాష్ట్ర ఖాదీ బోర్డు చైర్మన్ కేకే చౌదరి మాట్లాడుతూ మన ప్రాంతంలో ఇలాంటి గొప్ప పారిశ్రామిక అధినేతలు ఉండడం ఎంతో గొప్పతనం అన్నారు. ఇలాంటి వారి ద్వారా ఎందరో పేదలు చిన్న పారిశ్రామికవేత్తలు అభివృద్ధి చెందారని నేడు ఆయన లేని లోటు వారి కుటుంబ సభ్యుల ద్వారానో,అత్యంత ప్రముఖుడైన విశ్వేశ్వరరావు ద్వారానో కోడూరు ప్రజలు తీర్చుకోవాలని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ జింపెక్స్ అధినేత ఆర్ఎస్ గోయింకా సుమారు అర్ధ శతాబ్దానికి పైగానే ఇక్కడ వ్యాపార రీత్యా స్థిరపడ్డారన్నారు. ఆయనది కలకత్తా అయినప్పటికీ ఆయన తెలుగువాడిగా కోడూరు ప్రాంత వాసిగా ఉన్నారన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా ప్రజలకు సంబంధించి ఏదైనా కోరితే కాదు లేదు అనకుండా వెంటనే ఆయన శక్తి మేర ప్రజలకు సంబంధించిన సమస్యను ఏ రకంగా నైనా తీర్చేందుకు ముందుండే వారన్నారు. మంగంపేట సిపిఓ గోపీనాథ్ మాట్లాడుతూ మంగంపేట బెరైటీస్ గనుల్లో తాను ప్రముఖ జియాలజిస్ట్ గా వచ్చినప్పటికీ జియాలజీస్ట దృష్టిలో కూడా గో యింకా సలహాలు తీసుకుని బెంచ్ ఫార్మేషన్ లుక్ అని ఓర్ ఓబి బద్దన్లు కానీ అడిగి తెలుసుకునే వారమన్నారు.భూమిని నమ్మిన వ్యక్తి ఎన్నడూ చెడిపోడని ఆయన నమ్మిన సిద్ధాంతమని తెలిపే వారన్నారు. అదేవిధంగా తను బ్రతుకుతూ ఇతరులను బ్రతికించాలన్నది కూడా ఆయన ప్రధాన ధ్యేయమని ఈ రెండు సూచనలను తాను పాటించాలని ఆయన కొనియాడారు. అనంతరం జింపెక్స్ కంపెనీ డైరెక్టర్ వినోద్ చౌదరి మాట్లాడుతూ ఆయన పట్ల కులాలకు అతీతంగా, మతాలకు అతీతంగా, రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి వచ్చి ఆయన ఆత్మకు శాంతిని చేకూరే విధంగా సంస్మరణ సభలో పాల్గొన్న వారందరినీ చూస్తుంటే ముమ్ముందు కూడా జింపెక్స్ సంస్థకు, అందులో పని చేసే మాకందరికీ పెద్దాయనకు చూపిన ఆదరభిమానాలే మాపట్ల కూడా చూపి మమ్మల్ని ఆదరించి మా ద్వారా సహాయ సహకారాలు పొందాలని కోరారు. అనంతరం గోయింకా కుమారుడైన కరణ్ గోయింకా మాట్లాడుతూ మా సంస్థ పట్ల, మా తండ్రిగారి పట్ల కోడూరు నియోజకవర్గ ప్రాంత ప్రజలు, నాయకులు,రాజకీయ పార్టీలు, వ్యాపారవేత్తలు చూపిన ఆధర అభిమానం మేము జన్మలో సంపాదించుకోలేమని, ఇంత స్థాయిలో మా తండ్రిగారైన ఆర్ఎస్ గోయింకా పొందిన ఆదరభిమానాలను ఎక్కడ చూడలేమని ఆయన తీవ్ర స్థాయిలో దిగ్భ్రాంతి చెంది దుక్కించారు. ఆయన దుఃఖం సభకు వచ్చిన అందరి మనసులను కలచివేసింది. అందరి ప్రసంగంలోనూ జింపెక్స్ అధినేత ఆర్ఎస్ గోయింకా భౌతికంగా లేరేమో కానీ ఆయన ఆత్మ విశ్వేశ్వరరావులో కలిసి ఉందని వేదికపై ప్రసంగించిన వక్తల అందరూ కొనియాడడం విశేషం. ఈ కార్యక్రమంలో పంతగాని నరసింహ ప్రసాద్, తాతంశెట్టి నాగేంద్ర, చంద్రమోహన్ అన్వర్ భాష అడ్వకేట్ రెడ్డయ్య,బిజెపి చంగల్ రాజు, సిపిఐఎం కార్యవర్గ సభ్యుడు సిహెచ్ చంద్రశేఖర్ తదితరులు జింపెక్స్ అధినేత గోయింకా చేసిన సేవలు కొనియాడారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులదే

: మంత్రి ఫరూక్"

నాణ్యమైన విద్యతో విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చాలి

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పులు ఉపాధ్యాయులు - కలెక్టర్ రాజకుమారి

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో మంత్రి, జిల్లా కలెక్టర్





నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 05 (రిపబ్లిక్ న్యూస్)
విద్యార్థుల్లో జ్ఞానం, క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ వారిని ఉన్నత శిఖరాలకు చేర్చడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పాల్గొని ఉత్తమ సేవలు అందించిన 45 మంది ఉపాధ్యాయులను సత్కరించి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ మాట్లాడుతూ, భారత మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త, మహోన్నత విద్యావేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యారంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, వారి ప్రతిభను గౌరవిస్తూ అవార్డులతో సత్కరించడం సంతోషకరమైన విషయమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన, పౌష్టికాహారం అందించేందుకు మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేసి విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని మంత్రి సూచించారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా, కమ్యూనికేషన్ రంగాల్లో వేగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. విద్యతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తూ సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. రాయలసీమ ప్రాంతాల్లో విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. నంద్యాల జిల్లా ఎడ్యుకేషనల్ హబ్‌గా అభివృద్ధి చెందుతూ డిగ్రీ, ఇంటర్మీడియట్, ఇంజనీరింగ్, మెడికల్, అగ్రికల్చర్ తదితర ఉన్నత విద్యా సంస్థలకు కేంద్రంగా మారిందన్నారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు, వారి కుటుంబ సభ్యులకు మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు, ముఖ్యంగా తల్లులు చేసిన త్యాగాలు, కష్టాలు అభినందనీయమని, వారి కృషికి తగిన ఫలితంగా విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యాభివృద్ధితో పాటు సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు.

ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నారు
జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, “ఉపాధ్యాయుడు ఒక శిల్పి వంటివారని, శిల్పి ఒక రాయిని అందమైన శిల్పంగా మలిచినట్లే, ఉపాధ్యాయులు విద్యార్థులలోని ప్రతిభను గుర్తించి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతారు” అని పేర్కొన్నారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి ఆకాంక్ష మేరకు ఆయన జన్మదినమైన సెప్టెంబర్ 5ను ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు తరగతి గది నాలుగు గోడల మధ్య బోధన చేస్తున్నప్పటికీ, వారి కృషి దేశ భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోందన్నారు. ప్రతి విద్యార్థిని సమాన దృష్టితో చూడాలని, ముఖ్యంగా స్లో లెర్నర్స్‌పై ప్రత్యేక శ్రద్ధ, ప్రేమ చూపిస్తూ వారి అభ్యసనా సామర్థ్యాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. నంద్యాల జిల్లాలో స్కూల్ ఎడ్యుకేషన్, ఇంటర్మీడియట్, కాలేజియేట్ ఎడ్యుకేషన్ విభాగాల్లో మంచి వర్క్ కల్చర్ ఉందని కలెక్టర్ ప్రశంసించారు. విద్యార్థుల ప్రగతికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య మరింత మెరుగైన సమన్వయం, సాన్నిహిత్యం అవసరమన్నారు.

విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. తల్లికి వందనం, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్స్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, మన బడి-మన భవిష్యత్తు, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ, పీఎం శ్రీ పాఠశాలలు వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పిస్తున్నామని వివరించారు. విద్యార్థుల్లో కేవలం విద్యా సామర్థ్యం మాత్రమే కాకుండా మానసిక ధైర్యం, ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సాఫ్ట్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్‌ను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. “నేను చేయలేను” అనే భావన విద్యార్థుల్లో రాకుండా వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. విద్యార్థులను కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం చేయకుండా ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌లోనూ ప్రోత్సహించాలని తెలిపారు. విజయంతో పాటు ఓటమిని కూడా సమర్థంగా ఎదుర్కొనే మానసిక స్థైర్యాన్ని విద్యార్థుల్లో పెంపొందించాలన్నారు.

మెడిసిన్, ఇంజనీరింగ్‌తో పాటు అన్ని అవకాశాలపై అవగాహన కల్పించాలి

10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ అనంతరం విద్యార్థులకు అందుబాటులో ఉన్న వివిధ విద్యా, ఉద్యోగ అవకాశాలపై ఉపాధ్యాయులు నిరంతరం అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల లక్ష్యాలను కేవలం మెడిసిన్, ఇంజనీరింగ్‌కే పరిమితం చేయకుండా సివిల్ సర్వీసెస్, ఇతర పోటీ పరీక్షలు, ఉన్నత విద్య, పరిశోధన రంగాల వైపు కూడా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు చదువును మధ్యలోనే నిలిపివేయకుండా యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించేలా, పీహెచ్‌డీ, పరిశోధన, శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించేలా మార్గనిర్దేశం చేయాలని సూచించారు. విద్యార్థులకు అన్ని రంగాలపై అవగాహన, మంచి పట్టు కల్పించడం ద్వారా వారి కెరీర్‌కు బలమైన పునాది వేయవచ్చన్నారు.

విద్యా ఫలితాలను మరింత మెరుగుపరచాలి

10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో నంద్యాల జిల్లా ర్యాంకును మరింత మెరుగుపరచేందుకు విద్యా సంవత్సరం ప్రారంభమైన మొదటి రోజు నుంచే ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీలు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రులకు ఎలాంటి సందేహాలు లేకుండా



నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా, సాధ్యమైనంత వరకు 100 శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ముందుకు సాగాలని కోరారు. సాధారణ విధుల్లో భాగంగా పనిచేయడమే కాకుండా విద్యార్థుల అభ్యున్నతికి ప్రత్యేక కృషి చేస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఆత్మకూరు మండలం కొట్టాల చెరువు పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను కేవలం 5-10 నుంచి 135కు పెంచిన ఉపాధ్యాయుడి సేవలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పురస్కారాలు అందుకున్న 45 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు, వారి కుటుంబ సభ్యులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంత్రి, కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ పి. జనార్దన్ రెడ్డి, డిఐఈఓ శంకర్ నాయక్, ఉపాధ్యాయులు, పురస్కార గ్రహీతలు, వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

నంద్యాల మున్సిపాలిటీ 42 నుంచి 52 వార్డులుగా పునర్విభజన

వార్డుల సరిహద్దులపై ప్రజల నుంచి సలహాలు, సూచనలు, అభ్యంతరాలకు ఆహ్వానం

సెప్టెంబర్ 5 నుంచి 11 వరకు అభిప్రాయాల సమర్పణకు అవకాశం



నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 05 (రిపబ్లిక్ న్యూస్)
నంద్యాల పురపాలక సంఘంలో ప్రస్తుతం ఉన్న 42 వార్డులను 52 వార్డులుగా పునర్విభజించే ప్రక్రియకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలు, ప్రజల నుంచి సలహాలు, సూచనలు, అభ్యంతరాల స్వీకరణ తదితర అంశాలపై కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నతో శనివారం చర్చించారు.కమీషనర్ & డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మిని(స్ట్రేషన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు సర్క్యులర్ ఆర్.ఓ. నెం.13032/2/2026/H1-2, తేదీ 01-09-2026 ద్వారా, అలాగే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వారు W.P.No.15045/2026లో తేదీ 03-09-2026న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు నంద్యాల పురపాలక సంఘంలోని ప్రస్తుత 42 వార్డులను 52 వార్డులుగా పునర్విభజించేందుకు కొత్త షెడ్యూల్ జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కలెక్టర్ కు నివేదించారు. ఈ మేరకు ఫారం నెం.1 / రూల్ 4(i) నోటిఫికేషన్ ద్వారా ప్రతిపాదిత వార్డుల సరిహద్దులపై ప్రజల నుంచి సలహాలు, సూచనలు మరియు అభ్యంతరాలను 7 రోజుల వ్యవధిలో, అనగా 05-09-2026 నుంచి 11-09-2026 వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం వార్డుల సరిహద్దుల వివరణతో కూడిన ఫారం నెం.1 / రూల్ 4(i) నోటిఫికేషన్ ప్రతులను జిల్లా కలెక్టర్ కార్యాలయం – నంద్యాల, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం – నంద్యాల, తహసీల్దార్ కార్యాలయం – నంద్యాల, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం – నంద్యాల, ఎంపీడీవో కార్యాలయం – నంద్యాల, హెడ్ పోస్టాఫీసు మరియు నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నంద్యాల పురపాలక సంఘ పరిధిలోని ప్రజలు ప్రతిపాదిత వార్డుల సరిహద్దులను పరిశీలించి, తమకు ఏవైనా సలహాలు, సూచనలు లేదా అభ్యంతరాలు ఉంటే వాటిని సంబంధిత ఆధారాలతో సహా 05-09-2026 నుంచి 11-09-2026 లోపు మున్సిపల్ కమిషనర్, నంద్యాల పురపాలక సంఘం కార్యాలయంలో లిఖితపూర్వకంగా సమర్పించాలని మున్సిపల్ కమిషనర్ కోరారు. వార్డుల పునర్విభజన ప్రక్రియలో నిర్దేశిత నిబంధనలు, నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధివిధానాలు మరియు గడువును కచ్చితంగా పాటిస్తూ, ప్రజల నుంచి అందే అభిప్రాయాలను నిబంధనల ప్రకారం పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

బలిజ పేద మెరిట్ విద్యార్థులకు
‘రోపా’ స్కాలర్‌షిప్‌లు: దరఖాస్తుల ఆహ్వానం



నంద్యాల సెప్టెంబర్ 05 (రిపబ్లిక్ న్యూస్)
రాయల అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (రోపా) ఆధ్వర్యంలో గుంటూరు శ్రీ తులసి సీడ్స్ అధినేత శ్రీ రామచంద్ర ప్రభు సహకారం, కర్నూలు మరియు నంద్యాల జిల్లాల బలిజ ఉద్యోగులు, ప్రొఫెషనల్స్ విరాళాలతో గత 18 సంవత్సరాలుగా నిరంతరాయంగా బలిజ పేద మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నట్లు రోపా ప్రతినిధులు పసుపులేటి జనార్ధన్, చెన్నంశెట్టి శ్రీనివాసులు, కామిని మల్లికార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి (2026--27) కూడా అర్హులైన బలిజ పేద మెరిట్ విద్యార్థుల నుంచి స్కాలర్‌షిప్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన అర్హులైన విద్యార్థులు ‘రోపా’ కార్యవర్గ సభ్యుల వద్ద నుంచి దరఖాస్తు ఫారాలను పొందవచ్చు. గత సంవత్సరం స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులు రెన్యువల్ కోసం ‘ఫారం-బి’ , నూతనంగా దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ‘ఫారం-ఎ’ పూర్తి చేసి సమర్పించాలని తెలిపారు . పూర్తి చేసిన దరఖాస్తులను సెప్టెంబర్ 15వ తేదీలోపు అందజేయాలని అన్నారు. దరఖాస్తు ఫారాల కోసం, పూర్తి చేసిన పత్రాలను సమర్పించడానికి క్రింది సభ్యులను సంప్రదించగలరని అన్నారు పసుపులేటి జనార్ధన్ 9440420389, చెన్నంశెట్టి శ్రీనివాసులు 9885763763, కామిని మల్లికార్జున్ 9246279444 అర్హులైన బలిజ పేద మెరిట్ విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రోపా కార్యవర్గం కోరింది.ం

ఎల్నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అధికారులు సమగ్ర కార్యాచరణతో సిద్ధంగా ఉండాలి

పంటల సాగులో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలి

రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సమన్వయంతో పనిచేయాలి

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల బ్యూరో, సెప్టెంబరు 05 (రిపబ్లిక్ న్యూస్)
ఎల్నినో ప్రభావం కారణంగా జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో దాని ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అభివృద్ధి, వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల పరిధిలో అమలవుతున్న కార్యక్రమాలు, పురోగతి, లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సీపీఓ ప్రకాష్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం కారణంగా జిల్లాలో ఇప్పటివరకు సాధారణం కంటే 64.1 శాతం లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. జిల్లాలో సుమారు 2.20 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమి ఉండగా, ఇప్పటివరకు సుమారు 1.65 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేసినట్లు తెలిపారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. నీటి ఎద్దడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి, మొక్కజొన్న వంటి అధిక నీటి అవసరం ఉన్న పంటల సాగును తగ్గించి, శనగ, సోయాబీన్, పెసర తదితర తక్కువ నీటి అవసరం ఉన్న పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని ఆదేశించారు. ముఖ్యంగా మొక్కజొన్నకు ప్రత్యామ్నాయంగా కంది సాగును ప్రోత్సహించేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ-క్రాప్ నమోదు ప్రాధాన్యతను రైతులకు వివరించాలని కలెక్టర్ ఆదేశించారు. పంట నష్టపోయిన సందర్భంలో ప్రభుత్వ పథకాల ద్వారా పరిహారం, పంట బీమా వంటి ప్రయోజనాలు పొందేందుకు ఈ-క్రాప్ నమోదు కీలకమని, పంట సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో నమోదు అయ్యేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో మొత్తం 49,050 హెక్టార్ల ఉద్యాన పంటల విస్తీర్ణం ఉండగా, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 25,261 హెక్టార్లలో వివిధ ఉద్యాన పంటలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని మరింత పెంచడంతో పాటు రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక వసతులు, మార్కెటింగ్ సదుపాయాలు అందేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఉద్యాన రంగ అభివృద్ధికి జిల్లాలో రూ.986.63 కోట్ల మేర నిధులు మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

పాఠ్యాంశాలతో పాటు సమాజంపై అవగాహన అవసరం

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి: ఉత్తమ ఉపాధ్యాయుడు పి. నబీ రసూల్



దేవనకొండ, సెప్టెంబర్ 5(ప్రజా రిపబ్లిక్ న్యూస్):-
పాఠ్యాంశాలను బోధించడంతో పాటు విద్యార్థులకు సమాజంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెర్నేకల్ జడ్పీహెచ్ పాఠశాల సోషల్ ఉపాధ్యాయుడు పి. నబీ రసూల్ అన్నారు. ఉత్తమ సేవలకు గుర్తింపుగా ఆయనకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది.
ఈ సందర్భంగా పి. నబీ రసూల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠ్యాంశాలను అర్థవంతంగా, సులభంగా బోధించడంతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుత ప్రవర్తన వంటి అంశాలను అలవర్చాలని సూచించారు. ప్రస్తుత సమాజ పరిస్థితులు, సామాజిక సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా వారిలో మంచి ఆలోచనా విధానం పెంపొందుతుందన్నారు.విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా సమాజాన్ని అర్థం చేసుకుని, తమ బాధ్యతలను తెలుసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహిస్తే ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగుతారని పేర్కొన్నారు.తన సేవలను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసినందుకు సంబంధిత అధికారులకు, సహచర ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు మరింత బాధ్యతతో విద్యార్థుల అభ్యున్నతికి పనిచేయడానికి ప్రోత్సాహాన్ని ఇస్తుందని పి. నబీ రసూల్ పేర్కొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.:2023/67888

రేగుంట విద్యార్థినికి వైద్య సీటు

స్టేట్ ర్యాంక్‌తో ఎంబీబీఎస్‌లో ప్రవేశం

మల్లాపూర్ సెప్టెంబర్ 05 (రిపబ్లిక్ న్యూస్)



పట్టుదలతో చదివితే పల్లె ప్రాంతం నుంచి కూడా ఉన్నత విద్యా అవకాశాలను అందుకోవచ్చని రేగుంట గ్రామానికి చెందిన మోతే హన్సిక నిరూపించింది. ఎంబీబీఎస్ మొదటి రౌండ్ కౌన్సెలింగ్ ఫలితాల్లో హన్సిక 6,547 స్టేట్ మెరిట్ ర్యాంక్ సాధించి ఆసిఫాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు దక్కించుకుంది. మల్లాపూర్ మండలం రేగుంట గ్రామానికి చెందిన మోతే శ్రీనివాస్, సంజన దంపతుల కుమార్తె హన్సిక చిన్ననాటి నుంచే వైద్య విద్యపై ఆసక్తి పెంచుకుంది.


మంచి వైద్యురాలిగా ఎదిగి ప్రజలకు సేవలందించాలి. :సర్పంచ్ తీట్ల లహరి రాజేష్

ఈ సందర్భంగా సర్పంచ్ తీట్ల లహరి రాజేష్ మాట్లాడుతూ... వైద్యురాలిగా ఎదగాలనే లక్ష్యంతో చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ, క్రమశిక్షణతో ముందుకు సాగుతూ కష్టపడి చదివి సాధించిన మంచి ర్యాంక్ ద్వారా ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించడం ఆమె ప్రతిభకు నిదర్శనమని సర్పంచ్ తీట్ల లహరి రాజేష్ అన్నారు. హన్సిక ఎంబీబీఎస్ సీటు సాధించడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన విద్యార్థిని వైద్య విద్యలో ప్రవేశం పొందడం పట్ల రేగుంట గ్రామస్థులు కూడా హర్షం వ్యక్తం చేశారు. హన్సికను పలువురు అభినందిస్తూ, వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి మంచి వైద్యురాలిగా ఎదిగి ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు హన్సిక విజయం స్ఫూర్తిగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఆమె సాధించిన విజయం చాటిచెబుతోందని పలువురు ఆమెను అభినందించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న గురుగుబెల్లి నర్శింగరావు

మల్లాపూర్ సెప్టెంబర్ 5 (రిపబ్లిక్ న్యూస్)





విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా 24 సంవత్సరాలుగా విద్యారంగంలో విశిష్ట సేవలందిస్తున్న గురుగుపెల్లి నర్శింగరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఈ సందర్భంగా శనివారం జగిత్యాల కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్, అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్, జిల్లా విద్యాధికారి కె. రాము మరియు జిల్లా గ్రంథాలయ చైర్మన్ దినేష్ కుమార్ గార్ల చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు. నర్శింగరావు తన 24 సంవత్సరాల ఉపాధ్యాయ సేవలో వివిధ పాఠశాలల్లో అంకితభావంతో పనిచేశారు. మల్లాపూర్ మండలం రేగుంట ప్రాథమిక పాఠశాలలో 7 సంవత్సరాలు, రాయికల్ మండలం మూటపల్లి ప్రాథమిక పాఠశాలలో 7 సంవత్సరాలు, మల్లాపూర్ మండలం సాతారం ప్రాథమిక పాఠశాలలో 7 సంవత్సరాలు, ప్రస్తుతం మల్లాపూర్ మండలం రేగుంట ప్రాథమిక పాఠశాలలో గత 3 సంవత్సరాలుగా సేవలందిస్తున్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ప్రతిభను వెలికితీయడం, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది.ఈ సందర్భంగా PRTU TS రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కోగిల కృష్ణ, కుంబాల శ్రీనివాస్ రెడ్డి, లక్కడి శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షులు అమర్‌నాథ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనందరావు, మల్లాపూర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేశిరాజు, రాజేష్, మంగ నలీన్ కుమార్, మాజీ మండల అధ్యక్షులు ఎనగందుల శ్రీనివాస్ తదితరులు నర్శింగ రావును అభినందించారు.

సాంబారు కుటుంబంలో మెరిసిన రత్నం "మణికంఠ"కరీంనగర్ ప్రతిమ మెడికల్ కాలేజీలో సీటు రావడం తో సంతోషములో కుటుంబం

రాయికల్ మండలం సెప్టెంబర్,05(రిపబ్లిక్ న్యూస్)



సామాన్య కుటుంబం నుండి చాలా కష్టపడి తన చదువు లేకున్నా మా పిల్లలు బాగుండాలని చార్బాయ్ బీడీ కంపనీ నడిపిస్తున్న జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణం కేశవ్ నగర్ కు చెందిన సంబారు శ్రీనివాస్ పద్మ ల కొడుకు సాంబారు మణికంఠ నిట్ ఎక్సమ్ లో 456 మార్కులతో ఉత్తీర్ణత సాధించి కరీంనగర్ ప్రతిమ హాస్పిటల్ లో ప్రభుత్వ సీటు సాధించినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నా శ్రీనివాస్ పద్మలు ఈ విషయంలో వాళ్ళ తాత సంభారు నర్సయ్య లక్ష్మి లు అలాగే దాసరి వెంకటి వెంకమ్మ వాళ్ళ మామయ్య దాసరి నరేష్ లావణ్య శృతివల్లి మణికంఠ కు తల్లి తండ్రులకు శుభాకాంక్షలు తెలిపారుఅలాగే ఏడో వార్డులో వున్నా బిఆర్ఎస్ పట్టనా అధ్యక్షులు ఎలిగేటి అనిల్ కుమార్, రాయికల్ మున్సిపల్ మాజీ ఆప్షన్ నెంబర్ డాక్టర్ పిప్పోజి మహేందర్ బాబు రాయికల్ మాజీ సర్పంచ్ ఏద్దశీడి భూమరెడ్డి మాజీ రాయికల్ సింగల్ విండో అధ్యక్షుడు గన్నవరం ప్రభాకర్, జగిత్యాల జిల్లా ఇంటర్నేషనల్ ఉమెన్స్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆడెపు రాజమౌళి, సింగని గంగాధర్, సుంకే భూమయ్య, సుంకే శంకర్,అయ్యవారు వెంకట నరసయ్యసార్ కమ్మరి పెద్ద నరసయ్య, పెడివెల్లి నరసయ్య, లింబాద్రి, గట్టు వెంకట నరసయ్య,గట్టు రాజ నరసయ్య, గట్టు లక్ష్మీ నరసయ్య, గట్టు రమేష్ నరసయ్య, డాక్టర్ గట్టు నరేష్, సురగంటి రాజిరెడ్డి, మేకల వెంకటి, కడకుంట్ల గంగాధర్, మచ్చ శ్రీధర్, ఏలేటి తిరుపతిరెడ్డి,పద్మశాలి సేవా సంఘం గుడేటి రెడ్డి కాపు సంఘం, విశ్వబ్రాహ్మణ సేవా సంఘం సౌదీ అరేబియా రియద్ సాట అధ్యక్షులు శ్రీనివాస్ మచ్చలు మణికంఠకు తల్లి తండ్రులు సంబారు శ్రీనివాస్ పద్మలకు శుభాకాంక్షలు తెలిపారు

ఉపాధ్యాయులను సన్మానించిన సర్పంచ్ తోట శ్రీనివాస్



మల్లాపూర్ సెప్టెంబర్ 5 (రిపబ్లిక్ న్యూస్)

మల్లాపూర్ మండలంలోని రాఘవపేట గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్వేపల్లి రాధాకృష్ణ గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన సర్పంచ్ తోట శ్రీనివాస్. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మద్దెల నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి మోహన్ నాయక్, మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు దామోదర్ రెడ్డి, ఉపాధ్యాయులు పురుషోత్తం, మధు, రమణ చారి, రాజ శేఖర్, నరేశ్ మరియు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బెల్లాల కుటుంబంలో మెరిసిన ధ్రువతారాలు

చెర్ల కొండాపూర్లో ఒక ఇంటి నుండి ప్రభుత్వ సీటు సాధించిన బెల్లాల శృతి,శ్రవణ్ ఇద్దరు డాక్టర్లు

రాయికల్ మండలం సెప్టెంబర్ 05(రిపబ్లిక్ న్యూస్)



బెల్లాల కుటుంబంలో ఇంతవరకు పై చదువులు చదివిన వారాశీటూ ఎవ్వరు లేరు ప్రాణం పోసేందుకు ముందుకొచ్చిన బెల్లాల శృతి, శ్రవణ్ (సంపత్) ఇద్దరికీ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు రావడం హర్షనీయం పోయిన సంవత్సరం భూపాల్ పల్లి జయశంకర్ ప్రభుత్వ మెడికాల్ కాలేజీలో 2025 బ్యాచ్లో సిటు సంపాదించిన శృతి అలాగే బెల్లాలా శ్రవణ్ (సంపత్) పదవ తరగతి వరకు సింగారావుపేట్ గురుకులం లో విద్యనభ్యసించి ఫస్ట్ క్లాస్ లో ఉత్తీర్ణత సాధించి పై చదువుల కొరకు హైదరాబాద్ చేరుకుని అక్కడ ప్రైవేట్ కళాశాలలో చదువుకొని నీట్ ఎగ్జాం రాయగ 2026 నీట్ లో 460 మార్కులు సాదించి కరీంనగర్ ప్రతిమ మెడికల్ కాలేజీలో సీటు రావడం జరిగింది జగిత్యాల జిల్లా రాయికల్ మండలం చెర్ల కొండాపూర్ గ్రామానికి చెందిన బెల్లాల కుటుంబంలో ముత్యంలా మెరిసిన శ్రవణ్, శృతులు ఈ సందర్భంగా పిల్లలు మాట్లాడుతూ మా తల్లిదండ్రులు బెల్లల సంధ్య బాలకృష్ణ ఇద్దరు ఎంతో కష్ట పడి మమ్మల్ని చదివిపించి ఈ సాయికి తెచ్చారని వారన్నారు వారి కష్టాన్ని మేము నిరూపించమని గర్వంగా చెప్పారు
ఆ గ్రామంలో ఇంతవరకు మెడిసిన్స్ సాధించిన వ్యక్తులు లేరు వీరు ఆ గ్రామానికి వన్నె తేవడం ఎంతో అభినందనీయమని గ్రామస్తులు అంటున్నారు తల్లిదండ్రులు చదవలేకున్నా పిల్లలు మంచి విద్యాబుద్ధులు నేర్చుకున్నారని ఆ గ్రామ పెద్దలు అంటున్నారు పిల్లలు మంచి వైద్య వృత్తిలో ఉంటూ పై స్థాయికి ఎదిగి గ్రామీణ గిరిజన ప్రాంతాలలో ఉన్న ప్రజలకు సేవ చేస్తామని శృతి శ్రవణ్ (సంపత్) అన్నారు

రాయికల్ మండలంలో పలు ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

రాయికల్ మండలం సెప్టెంబర్,05(రిపబ్లిక్ న్యూస్)





జగిత్యాల జిల్లా రాయికల్ మండలం వస్తాపూర్ గ్రామానికి చెందిన రమావత్ లత మోతిలాల్ మరియు కట్కాపూర్ గ్రామానికి చెందిన మాదం అఖిల రాజకుమార్ గార్ల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై ఇందిరమ్మ ఇల్లులను ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్
ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాటిపెళ్ళి గంగరెడ్డి,పాక్స్ చైర్మెన్ ఏనుగు మల్లారెడ్డి,గ్రామ సర్పంచ్ గుగులోత్ తిరుపతి,ఉప సర్పంచ్ అంజద్, రాయికల్ మున్సిపల్ మాజీ చైర్మెన్ మోర హన్మండ్లు, మాజీ మున్సిపల్ కోఆప్షన్ నెంబర్ డాక్టర్ పిప్పోజీ మహేందర్ బాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రవీందర్రావు,కోల శ్రీనివాస్, బాపన్న, ముజాహిద్, వెంకటేష్, మహేష్,రవి,నవీన్, మహేష్, సర్పంచులు రమేష్ నాయక్, తిరుపతి నాయక్,ప్రసాద్ నాయక్, సంతోష్ నాయక్, మల్లేశం, చంద్రశేఖర్, సాయిరాజ్, మల్లేష్, తలారి రాజేష్,వెంకటేష్, కృష్ణమూర్తి, మీనుగు అంజన్న ఆంజనేయులు మరియు దీపక్ రెడ్డి, తిరుపతి రెడ్డి, సురేందర్ నాయక్, గణేష్,సురేష్, శ్రీనివాస్,పాదం రాజు, జక్కుల చంద్రశేఖర్,నిమ్మల శేఖర్ రెడ్డి,ఏనుగు మల్లారెడ్డి,ఇర్ఫాన్,ముఖీద్,తంగేళ్ల రమేష్, రాజమౌళి,రాజీ రెడ్డి, మల్లేష్, రంజిత్,సుందర్ నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్య ఏదైనా చిటికలో పరిష్కరించి అన్ని సమస్యలు తీర్చడానికి మేమున్నాము

ఇంటర్నేషనల్ ఉమెన్ రైట్స్ ప్రొటెక్షన్ - కౌన్సిల్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఆడెపు రాజమౌళి

రాయికల్ మండలం సెప్టెంబర్,05 (రిపబ్లిక్ న్యూస్)



మీకు ఏ సమస్యలున్న మమ్ములను సంప్రదించాలని మండలాలలో అయితే ప్రజా పరిషత్ తాసిల్దార్ కార్యాలయం పోలీస్ స్టేషన్,అట విశాఖ కార్యాలయల లో ఏ సమస్య ఉన్న మహిళలను హింసించడం భార్యాభర్తలు వారి సమన్వయం కోల్పోతే మా దగ్గరికి వస్తే కౌన్సిలింగ్ ఇచ్చి వారి కుటుంబాలను కలుపుతామని, మదకద్రవ్యాలను వినియోగిశేచే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఏ సమస్య ఉన్న మాకు తెలపాలని జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఆడపు రాజమౌళి తెలిపారు
ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ లోని ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ మానవ హక్కుల పరిరక్షణ మండలి అన్ని జిల్లాల స్థాయి సమన్వయ సమావేశం జాతీయ అధ్యక్షుడు ఎస్.కె మజీద్ జాతీయ స్థాయి చైర్మన్ శ్రీమతి షిరీన్ ఆధ్వర్యంలో జరిగిందని జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఆడెపు రాజమౌళి తెలిపారు
తెలంగాణ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి జిల్లా మండల స్థాయి కార్యవర్గ సభ్యుల భాగస్వామ్యంతో మానవ హక్కుల పరిరక్షణ మండలి ఐ హెచ్ ఆర్ పి సి సమన్వయ సమావేశం జరిగిందని ఆడపు రాజమౌళి తెలిపారు
అంతర్జాతీయ మానవ హక్కుల పరిరక్షణ మండలి భారత ప్రభుత్వము కార్పోరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో నమోదైన ఒక సెక్షన్ 8 కంపెనీ ఇది మానవ హక్కులు మరియు సామాజిక న్యాయ పరిరక్షణ ప్రోత్సాహము కోసం పనిచేస్తుందని జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాజమౌళి తెలిపారు ప్రజా సంక్షేమం కోసం బాధ్యతయుతంగా పనిచేయాలని నిజమైన సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలకు సరైన సహాయము అందించాలని కార్యవర్గ సభ్యులకు జాతీయ అధ్యక్షుడు ఎస్.కె మజీద్ సభ్యులందరికీ సూచించాడు డైరెక్టర్ అండ్ నేషనల్ చైర్ పర్సన్ శ్రీమతి శిరీన్ సభ్యులను ఉద్దేశించి ప్రసంగిస్తూ మానవ భద్రత శాంతియుత కౌన్సిలింగ్ సరైన ఫిర్యాదుల పరిష్కారం మరియు న్యాయబద్ధమైన సహాయము యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు అవసరమైన చోటల్లా కౌన్సెలింగ్ నిర్వహించాలని ప్రతి విషయాన్ని స్పష్టం చేసి గౌరవప్రదంగా మరియు వివక్ష లేకుండా పరిష్కరించేలా చూడాలని ఆమె ప్రతినిధులందరికీ తెలియజేశారు సమావేశంలో వివిధ ప్రాంతాల నుండి జిల్లా మరియు మండల స్థాయి ప్రతి నిధులు పాల్గొన్నారు అన్వర్ నిజాంబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు నిజాంబాద్ ఉపాధ్యక్షులు షబానా బేగం నిజాంబాద్ జిల్లా అధ్యక్షుడు జైన్ ఆన్సర్ కరీంనగర్ మహిళా అధ్యక్షురాలు పి స్వప్న ,నిర్మల్ జిల్లా అధ్యక్షుడు ఆజామాదిన్ ఆర్ సాహెబ్, అలాగే జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఆడపు రాజమౌళి పాల్గొన్నారు అలాగే సమస్యలు ఉన్న నా టెలిఫోన్ నెంబర్ 9550413224 ఫోన్ లో కూడా సమస్యలు పరిష్కరించగలను అని ఆడపు రాజమొవాలి అన్నారు

రాయికల్ మండల ఓడ్డలింగాపూర్ లోకియా నాయక్ తండ బొక్క అక్షరకు ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీట్

రాయికల్ మండలం సెప్టెంబర్,05(రిపబ్లిక్ న్యూస్)





జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్ లోని లోకియా నాయక్ తండాకు చెందిన విద్యార్థిని బొక్క అక్షర హైదరాబాదులోని ప్రతిష్టాత్మక ఉస్మానియా మేడికల్ కాలేజీ వైద్య విద్య సీటు సాధించి సరికొత్త చరిత్ర సృష్టించారు గిరిజన ప్రాంతానికి చెందిన గిరిజన విద్యార్థిని చిన్నప్పటినుండి డాక్టర్ కావలనే లక్ష్యంతో నిరంతర శ్రమించి ఈ గొప్ప ఘనత ను సాధించారు నీట్ పరీక్షలో 499 మార్కులు సాధించి రాష్ట్రంలో ఎస్టి కేటగిరి లో 35వ ర్యాంక్ సాధించి జనరల్ కేటగిరిలో 1157ర్యాంక్ సాధించారు అక్షర ఒకటో తరగతి నుండి పదవ తరగతి వరకు మానస ఉన్నత పాఠశాలలో చదివి 10వ తరగతి ఫలితాల్లో 10/10 ఇంటర్మీడియట్ 975 మార్కులు సాధించినప్పటికీ చిన్నప్పటినుండి చదువులో ప్రతిభ కనబరుస్తూ నీట్ లో పరీక్ష వ్రాసి రాష్ట్రస్థాయిలో 35 ర్యాశీక్ సాధించి ఉస్మనియా లాంటి ప్రతిష్టాత్మక కాలేజీలో చోటు సంపాదించుకున్నారు తల్లిదండ్రులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా సేవలందిస్తుంది తల్లిదండ్రులు రాజేశ్వరి తమ కుమార్తె చిన్ననాటి కళ నెరవేరిశీది ఇలాంటి ప్రతిష్టాత్మక కాలేజీలో సీటు వస్తదని ఊహించలేవని ప్రభుత్వ ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రతిలాల్ రాజేశ్వరి తమ కుమార్తె చిన్నప్పటి కళ ఉస్మానియా మెడికల్ కాలేజీ సీటు రావడం పట్ల మురిసిపోతున్నారు తండ నుంచి వెళ్లి రాష్ట్రంలోనే అత్యుత్తమా మెడికల్ కాలేజీలో సీటు సాధించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు రాయికల్ మండల గిరిజన గ్రామాల మంచియా నాయక్ తండా సర్పంచ్ తిరుపతి నాయక్, చింతలూరు వనిత రమేష్,వస్తాపూర్ సర్పంచ్ తిరుపతి నాయక్,ఆలియా నాయక్ తండ జ్యోతి సంతోష్, పలు గ్రామాల ప్రజలు తల్లిదండ్రులకు అమ్మాయి అక్షరకు శుభాకాంక్షలు తెలిపారు

గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులకు ప్రాధాన్యత

: సర్పంచ్ తీట్ల లహరి రాజేష్

మల్లాపూర్ సెప్టెంబర్ 5 (రిపబ్లిక్ న్యూస్)



కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వి.బి.జి. రాంజీ పథకం నీటి వనరుల పెంపునకు దోహదపడుతుందని రేగుంట సర్పంచ్ తీట్ల లహరి రాజేష్ అన్నారు. పథకం ద్వారా లభించే ప్రయోజనాలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శనివారం రేగుంట గ్రామపంచాయతీ కార్యాలయంలో యంపిడివో అలువాల శ్రీకాంత్ అధ్వర్యంలో వి.బి.జి. రాంజీ పథకంపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తీట్ల లహరి రాజేష్ మాట్లాడుతూ గ్రామంలో నీటి సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన వివిధ పనులను పథకం ద్వారా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులను చేపడతామని పేర్కొన్నారు. పథకం ద్వారా వచ్చే ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ లబ్ధి పొందేలా కృషి చేస్తామని అన్నారు. నీటి వనరుల అభివృద్ధితో గ్రామంలో సాగు, తాగునీటి అవసరాలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తీట్ల లహరి రాజేష్, కార్యదర్శి వినీత, కారోబార్ సుధాకర్, వార్డు సభ్యులు కలసాని రాజన్న, బాస రాజరెడ్డి, మహమ్మద్ బషీర్, బొల్లారపు పుష్ప, బొల్లారపు లక్ష్మి, యండి.మైముదా, బైర లక్ష్మి, నాయకులు సురకంటి తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.